ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026

12 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

క్షేత్రస్థాయిలో ఐక్య పోరాటాలు

- కార్మిక, కర్షక మైత్రి కొనసాగాలి
- సిఐటియు 18వ అఖిల భారత మహాసభ చర్చల్లో ప్రతినిధులు



చర్చలు జరుపుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / అనతలవట్టం ఆనందన్ నగర్

విశాఖ సాగర తీరాన ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. గత నెల 31న ప్రారంభమైన ఈ మహాసభలో సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపైనా, తర్వాత ప్రవేశపెట్టిన నిర్మాణ అంశాల నివేదికపైనా శుక్రవారం సాయంత్రం వరకూ ప్రతినిధులు చర్చలు చేశారు. గత పోరాటాలను సమీక్షించుకున్నారు. క్షేత్రస్థాయిలో కార్మికులు, ప్రజలు, రైతులను ఏకం చేసి పోరాటాలు సాగించాలని రైతాంగ, వ్యవసాయ కూలీల ఉద్యమాలను తీవ్రం చేయాలని ప్రతినిధులు చర్చల్లో వెల్లడించారు. మహాసభల ప్రాంగణమంతా ఎర్రజెండాలు, ఎర్రతోరణాలు, ప్రతినిధుల సందడితో కోలాహలంగా కనిపించింది.

ప్రతినిధుల చర్చల్లో ఇప్పటివరకూ వారివారి రాష్ట్రాల్లో జరిగిన కార్మిక, ప్రజా పోరాటాల సందర్భంగా వచ్చిన అనుభవాలను మూడోరోజు సభలో వెల్లడించారు. మంచి అనుభవాలను ఇతర రాష్ట్రాల వారూ అమలు చేసేలాగ ఉదాహరణలతో సహా వెల్లడించారు. బెంగాల్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో జరిగిన కార్మికోద్యమాలు కొత్త కొత్త రంగాల నుంచి కార్మికులు సిఐటియు జెండా వైపు వస్తున్న తీరును పలు రాష్ట్రాల ప్రతినిధులు సభలో ప్రస్తావించారు. బిజెపి పాలిత రాష్ట్రాలు ముఖ్యంగా యుపి, గుజరాత్‌లలో జరుగుతున్న కార్మికోద్యమాల సందర్భంగా ప్రభుత్వ నిర్బంధాలను నివేదికల్లోనూ, చర్చల సందర్భంగా ప్రతినిధులు మాట్లాడిన సమయంలోనూ వెల్లడించారు. బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించడంలో సంఘాల వారీగా చైతన్యం కలిగించే కృషిని తెలియజేశారు. కొత్తకొత్త రంగాల్లో పోరాటాలకు శ్రీకారం చుట్టే దిశగా చర్చలు సాగించారు. కార్మిక, కర్షక మైత్రిని కొనసాగించాలని పలువురు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.



జివిఎంసి స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, సభ్యులు

జివిఎంసి స్థాయీ సంఘంలో

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులు సేనాపతి వసంత, మొల్లి హేమలత, మొల్లి ముత్యాలు, గంకల కవిత, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు, దాడి వెంకటేశ్వరరావు, గేదెల లావణ్య, మాదంశెట్టి చిన్నతల్లి, కొణతాల నీలిమ, సాడి పద్మారెడ్డిలతో కలసి స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన అజెండాలో 87 అంశాలు, 52 టేబుల్ అజెండా అంశాలతో పాటు మొత్తం 139 అంశాలు పొందుపరచగా, వాటిని స్థాయీ సంఘం సభ్యులు క్షుణ్ణంగా చర్చించి వివిధ కారణాలు వలన 30 అంశాలు వాయిదా వేశారని, మిగిలిన మొత్తం 109 అంశాలకు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో సుమారు రూ.26.46 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ప్రజా ఆరోగ్య విభాగం పారిశుధ్య కార్మికులు, సిబ్బంది

మిగతా 2లో..

డి పట్టా భూములకు గ్రామసభలో పాస్ పుస్తకాలు ఇవ్వాలి

వార్త 11లో..

గోవాడ సుగర్స్‌లోనే క్రషింగ్ చేయాలి

వార్త 9లో..

అంతర్జాతీయ సంప్రదాయ నృత్య కాంగ్రెస్ ప్రారంభం

వార్త 2లో..

మాజీ ఎమ్మెల్యే గంటెల సుమన మృతి



గంటెల సుమన (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాయకరావుపేట ఎస్‌సి రిజర్వుడు నియోజవర్గం మాజీ శాసన సభ్యురాలు గంటెల సుమన (67) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. 1958 డిసెంబర్ 21న ఆమె జన్మించారు. ప్రస్తుతం అక్కయ్యపాలెంలో నివసిస్తున్న ఆమె గత కొంతకాలంగా అస్వస్థతగా ఉండడంతో నగరంలోని కేర్ ఆసుపత్రిలో 10 రోజుల క్రితం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమెకు భర్త వీరయ్య, కుమారుడు కిరణ్, కుమార్తె ప్రియదర్శిని ప్రియ ఉన్నారు. అక్కయ్యపాలెం సంగం ఆఫీసుకు ఎదురుగా ప్రియదర్శిని ఓల్డ్ ఏజ్ హోమ్ స్థాపించి నిర్వహిస్తున్నారు. సుమన పార్థివ దేహాన్ని అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచటం జరిగిందని, శనివారం ఉదయం 11 గంటలకు, జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న, క్రిస్టియన్ సెమిస్ట్రీలో అంత్యక్రియలు జరుగుతాయని ఆమె కుమారుడు కిరణ్ తెలిపారు.

సుమన ప్రారంభంలో 1983లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన సుమన ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1989, 1994, 1999 ఎన్నికలలో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. 2004లో జరిగిన ఎన్నికలలో ఆమె కాంగ్రెస్ పార్టీని వీడి అదే నియోజవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. సుమన ఎయులో ఎంఎ చదివారు. తాటిచెట్లపాలెంలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆ తర్వాత సృజన పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకురాలుగా పనిచేసి, అదే కాలేజీకి ప్రిన్సిపాల్‌గా కూడా సేవలు అందించారు. సుమన మరణ వార్త తెలియడంతో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు తదితరులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కార్పొరేట్లతో చంద్రబాబు, పవన్, బిజెపి లాలూచీ

- ★ అప్పలరాజుపై పీడీ యాక్టు అంశాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం
- ★ అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శులు విజు కృష్ణన్, వెంకట్



నినాదాలు చేస్తున్న విజు కృష్ణన్, వెంకట్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, కర్రి అప్పారావు తదితరులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి నాయకులు కార్పొరేట్ కంపెనీలతో లాలూచీ పడి బలవంతపు భూ సేకరణకు పాల్పడుతున్నారని అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శులు విజు కృష్ణన్, బి.వెంకట్ అన్నారు. పీడీ యాక్టు కింద అరెస్టయిన ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కుటుంబాన్ని ఎస్.రాయవరం మండలం ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఉదయం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా విజు కృష్ణన్ మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంతంలో బలవంతపు భూ సేకరణ, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ చట్టబద్ధంగా నిరంతం పోరాటం చేస్తున్న

మిగతా 2లో..

అంతర్జాతీయ సంప్రదాయ నృత్య కాంగ్రెస్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సంప్రదాయ కళలకు, విశిష్ట సంస్కృతికి నిలయమైన విశాఖపట్నం నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, డ్యాన్స్ ఇండియా మాగజైన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డాన్స్ కాంగ్రెస్ (ఐటిడిసి -2026)' శుక్రవారం మద్దిలపాలెం కళాభారతిలో ఘనంగా ప్రారంభమైంది. జనవరి 4 వరకు మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవానికి దేశ, విదేశాల నుంచి ప్రముఖ కళాకారులు, పండితులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ రమణమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. బలదేవ నితాయి దాస్ బృందం సమర్పించిన నృసింహ స్తుతి' ప్రార్థనతో వేడుకలు ఆరంభమయ్యాయి. అనంతరం అమెరికా నుండి వచ్చిన స్వాతి గుండపునీడి అట్లూరి బృందం అద్భుత నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం కళాకారులకు దిశానిర్దేశం చేసేలా పద్మశ్రీ డాక్టర్ దర్శనా ఝవేరీ (మణిపూరి), కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత రాజేంద్ర గంగళీ (కథక్) విలువైన సెమినార్లు నిర్వహించారు. సుమారు 60 మంది కళాకారులు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు ముగింపులో భాగంగా, భారతీయ నృత్య రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ దర్శనా ఝవేరీకి ఐటిడిసి -2026 లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్-2026ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐటీడీసీ వ్యవస్థాపక ఛైర్మన్ బిఆర్.విక్రమ్ కుమార్, ఐటీడీసీ-2026 ఛైర్మన్ కెవి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నృత్య కళాకారులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రమణమూర్తి తదితరులు

మొదటి పేజీ తరువాయి..

కార్పొరేట్లతో చంద్రబాబు, పవన్, బిజెపి లాలూచీ

రైతు నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టడం అప్రస్వామికమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 70 శాతం మంది స్థానికులు వ్యతిరేకిస్తే భూ సేకరణ చేయడానికి వీల్లేదన్నారు. కాని ఇక్కడ భూ సేకరణ వ్యతిరేకంగా స్థానికులు పోరాడుతుంటే నాయకులపై ఎమర్జెన్సీ కాలం లాగా పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. యుపిలోని గ్రేటర్ నోయిడాలో కూడా ఇలాగే బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రెండు సంవత్సరాల పాటు పోరాటం జరిగిందని, అక్కడ కూడా దాదాపు 30 మంది నాయకులను మూడు నెలల పాటు జైలులో పెట్టారని తెలిపారు. ఇక్కడి ఉద్యమానికి మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం తరుపున జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ చంద్రబాబు ఈ ప్రాంతంలో పర్యటన చేసిన వెంటనే పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేశారని, చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్, బిజెపి కలిసి ఈ కేసు పెట్టారని విమర్శించారు. తాము అభివృద్ధికి వ్యతిరేకంగా కాదని, పరిశ్రమలు రావాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నామని, అయితే అభివృద్ధి పేరుతో జరుగుతున్న అరాచకత్వానికి అడ్డుకట్ట వేయాలని తాము చెబుతున్నాని తెలిపారు. ఇక్కడ ప్రభుత్వమే భూ బకాసునిలా భూ దందాలకు పాల్పడితే ఈ చట్టాలను కాపాడదే ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వం భూ మాఫియాలా వ్యవహరిస్తుందని, దేశంలో మోడీ ఒక పెద్ద డాన్ అయితే, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మరో డాన్‌లు లాగా వ్యవహరిస్తున్నారని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ డాన్‌ల పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. మత్స్యకారులకు సముద్రమే జీవనాధారమని, వారికి సముద్రం నుండి దూరం చేసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. మిట్టల్ కంపెనీ, బల్క్ డ్రగ్ కంపెనీ, రాబోయే గూగుల్, ఇతర వాటిల్లో చంద్రబాబు, పవన్ కల్యాన్, బిజెపి నాయకులకు వాటాలు ఉన్నాయని, అందు కోసమే ఈ బలవంతపు భూ సేకరణ అని పేర్కొన్నారు. వీరికి రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం కాదని, వారి కుటుంబాల అభివృద్ధి, వారి సంపాదనే ముఖ్యమని, అందుకే అభివృద్ధి పేరుతో అరాచకాలు చేయడానికి పూనకున్నారని విమర్శించారు. ఇక్కడ జరుగుతున్న ఉద్యమాన్ని అఖిల భాతర స్థాయికి విస్తరిస్తామని చెప్పారు. దీనిపై రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎం సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్, నాయకులు కరి శ్రీను, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

జీతభత్యాలు, జీవీఎంసీ ఉద్యోగుల సర్వీసు అంశాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించిన అద్దెలు మొదలైన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు, ఇతర జీవీఎంసీ సిబ్బంది జీతాలు ఇకపై నిర్ణీత సమయానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి బివి రమణ, పిడి-యుసిడి సరోజిని, జోనర్ కమిషనర్లు ఎం.మల్లయ్య నాయుడు, కే.శివప్రసాద్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఎఎమ్ఒహెచ్‌లు, యుసిడి డిపిఓ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టు ప్రకటన

టోర్నీకి ఆంధ్ర జట్టు సారథిగా విశాఖ క్రీడాకారుడు



ప్రశాంత్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జాతీయ సీనియర్ పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టును శుక్రవారం ప్రకటించారు. వారణాసిలో జరగనున్న 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర పురుషుల జట్టుకు నగరానికి చెందిన అంతర్జాతీయ వాలీబాలర్, జీఎస్టీ అండ్ కస్టమ్స్ విశాఖ శాఖ ఉద్యోగి పిన్నమరాజు ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ పోటీలు జనవరి 4 నుండి 11 వరకు జరగనున్నాయి. జట్టులో ఎస్.సుధీర్‌కుమార్, పి.గణేష్, వీరి వెంకటేష్, ఎం,సుదీర్, మైలపల్లి సత్యం, బీర భానుబాబు, మంతెన మనోజ్ దత్తా, ఐ.కళ్యాణ్ కుమార్, గుబ్బల శ్రీనివాస్, బుర్ల హేమంత్, బోకం ఆదిత్య, గోపిరెడ్డి వెంకటశివ, పెనుమత్స కృష్ణ చైతన్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిష్టాత్మక జాతీయ టోర్నీలో పాల్గొంటున్న ఆంధ్ర జట్టు సభ్యులను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించి పతాకం సాధించాలని ఆకాంక్షించారు.

తగ్గించిన వేతనాలు పెంచి చెల్లించాలి

104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రైవేట్ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తగ్గించిన వేతనాలను సరిచేసి పూర్తి వేతనాలు చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ల సాధన కోసం 104 ఉద్యోగులు త్వరలో చేపట్టనున్న సమ్మెలో భాగంగా శుక్రవారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో 104 సంఘాల సమావేశంతో పాటు అఖిలపక్ష సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. డిసెంబర్ 19 నుండి సమస్యల పరిష్కారం కోరుతూ, యాజమాన్యానికి నోటీసు ఇచ్చి, వివిధ పద్ధతులలో నిరసనలు తెలియజేసినా సమస్యలు పరిష్కారం కాలేదని, తప్పని పరిస్థితిల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సి వచ్చిందన్నారు. తొలగించిన క్యాజువల్ లీవ్‌లు పునరుద్ధరించాలని, అన్ని ప్రభుత్వ సెలవులు వర్తింపజేయ్యాలని, తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, ఇప్పుడున్న పూల్ విధానంపై పునరాలోచన చెయ్యాలని కోరారు. 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్‌లకు స్లాబ్ అమలు చేయాలని, 104 డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జివో 7 ప్రకారం రూ.18,500 వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులపై చేస్తున్న వ్యతిరేక చర్యలను ప్రశ్నించిన తమ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని అక్రమంగా సస్పెండ్ చేశారని, తక్షణం సస్పెన్షన్ రద్దు చెయ్యాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో 104 సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం విశాఖపట్నం, మద్దిలపాలెం డిపోలలో జరిగిన కార్యక్రమాలను ఆర్టిసి విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎడిసిపి ప్రవీణ్ కుమార్ హాజరై ఉత్తమ ప్రతిభ కనపరచిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్ చేసిన మెకానికల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ రోడ్డు భద్రత చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ ఎడిసిపి ప్రవీణ్ కుమార్,మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వచ్చాక మరింత బాధ్యతలు పెరిగాయని, దీనికి తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించి, బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధరరావు, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఉమా మహేశ్వరరెడ్డి, విశాఖపట్నం డిపో మేనేజర్ ఎ.మణి మాధురి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ రామకృష్ణ, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 11 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తన ఛాంబర్‌లో సిపిలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు.

నెలాఖరు వరకు ఎరువుల కొరత లేదు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఈ నెల ఆఖరి వరకు జిల్లాలో రైతులకు ఎరువుల కొరత ఉండదని, సరిపడినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి మీడియాకు తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో రబీ నందు వ్యవసాయ, ఉద్యాన పంటలు సుమారుగా 2158 హెక్టార్లలో సాగు అవుతుందన్నారు. నేటి వరకు 6532 హెక్టార్లలో వివిద పంటలు వేసి ఉన్నారని తెలిపారు. రబీ నందు వివిధ పంటల సాగుకు 2800 టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని, యూరియా 1700 టన్నులు, డిఎపి 400 టన్నులు, పొటాప్ 150 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 450 టన్నులు, ఇతరాలు 100 టన్నులు అవసరం అవుతుందని పేర్కొన్నారు. జనవరి నెలవరకు జిల్లాకు 1096 టన్నుల యూరియా అవసరం ఉండగా 1219 యూరియా టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1232 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా 722 టన్నులు, డిఎపి 197 టన్నులు, పొటాష్ 93 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 189 టన్నులు, ఇతరములు 31 టన్నులు ఉన్నాయని పేర్కొన్నారు.

'గంటా' గ్రీవెన్స్‌కు 40 వినతులు



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రాలు అందిస్తున్న స్థానిక నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వినతులను స్వీకరించారు. సుమారు 40 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఆనందపురం మండలంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేద కుటుంబాలకు మూడు సెంట్ల ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ఆనందపురం పూల మార్కెట్ విస్తరణ, గుడిలోవ దేవస్థానానికి వెళ్లే జాతీయ రహదారిపై సింహద్వారం ఏర్పాటు చేయాలని కోరారు. తర్లువాడ కొండపై టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆనందపురం- బోకురుపాలెం రోడ్డును విస్తరించడంతో పాటు నీలకుండీలు జంక్షన్ నుంచి చిన్నాపురం వెళ్లే రోడ్డును డివైడర్‌తో అభివృద్ధి చేయాలని, ఆనందపురం డిగ్రీ కళాశాల సమీపంలో ఇంటర్ కళాశాల ఏర్పాటుచేయాలని కోరారు. అన్ని పంచాయతీల్లో శ్మశానవాటికలు, స్పోర్ట్స్ జిమ్ షెడ్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఇదే కార్యక్రమంలో పాలవలస పంచాయతీ పరిధిలోని దిగువ పాలవలస, గుడిలోవ, మెట్టమీదపాలెం, ఎగువ పాలవలస గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలపై గ్రామ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనాల పూర్తి, సిసి రోడ్లు, శ్మశాన వాటికలకు ప్రహరీ, తాగునీటి సరఫరా, విద్యుత్ లైన్ల బలోపేతం, కాలువలపై కల్వర్టుల నిర్మాణం తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీనుబాబు, ఎంపిడిఒ వి.జానకి, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అప్పారావు, మాజీ అధ్యక్షులు బిఆర్‌బి.నాయుడు, పిఎసిఎస్ గన్రెడ్డి సోంబాబు, పాండ్రంకి అప్పలరాజు, రౌతు నాగరాజు, మల్లికార్జునరావు, బమ్మిడి ఉమ, రేగాని ఆదినారాయణ, నిమ్మల అప్పలరాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం



ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ పరిధి ఏలేరు కాలువలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని పురుష మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేశారు. మృతుడు గళ్ల చొక్కా, లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి గాయాలూ కనిపించలేదని వెల్లడించారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



గాయపడిన కూలీలు

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

ప్రజాశక్తి- వడ్డాది : బిఎన్ రోడ్డు వడ్డాదిలోని చెరకుకాటా వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలకుగాయాలయ్యాయి. కూలి పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వడ్డాది నుండి బుచ్చియ్యపేట వెళుతున్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బుచ్చియ్యపేటకు చెందిన అయితిరెడ్డి రమణమ్మ, డొంకిన పుష్ప, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనకాపల్లి తరలించారు. రహదారి ఆక్రమించుకుని దుకాణాల ఏర్పాటు, అడ్డగోలు పార్కింగ్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని,తరచూ ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- విజయనగరం : విజయనగరంలోని నగరంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖపట్నం జాలారిపేటకు చెందిన ఉదయ్ వెంకటతేజ(19) జెఎన్‌టియులో హాస్టల్‌లో ఉంటూ ఇఇఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తోటి స్నేహితులు కళాశాలకు వెళ్లినప్పటికీ వెంకటతేజ మాత్రం వసతి గృహంలోనే ఉండిపోయాడు. మధ్యాహ్నం భోజన విరామంలో తోటి విద్యార్థులు గదికి వచ్చి తలుపు కొట్టినప్పటికీ తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి చూసిన విద్యార్థులకు వెంకటతేజ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అధ్యాపకులకు సమాచారం ఇవ్వడంతో పోలీసుల వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

అమ్మవార్ల ఆలయాలు ప్రారంభం

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో పోలమాంబ, భూలోకమ్మ, రమణమ్మ, దుర్గాలమ్మ ఆలయాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.63.15 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ సాయంతో పాటు దివీస్ సాయం కూడా తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, చిక్కాల విజయ్‌బాబు, దంతులూరి అప్పలనరసింహరాజు (బుజ్జి), సరగడ అప్పారావు, పరశురామ్, పొట్నూరి రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్యాకుమారి చిత్ర ఉచిత ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో 2025లో విడుదలైన కన్యాకుమారి చిత్ర ఉచిత ప్రదర్శన, చిత్ర నటీనటులతో ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, ప్రతిభ ఉంటే సినీ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. సినీ రంగంలో అభిరుచికి తగ్గట్టుగా తాను కూడా చిత్రాలు నిర్మించానని చెప్పారు. గొప్ప సందేశాత్మక చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీని ఆయన అభినందించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ, ఉత్తరాంధ్రకు చెందిన అంశాలను చిత్రంలో గొప్పగా చూపించారన్నారు. ఉత్తరాంధ్రలో కళాకారులకు ఎంతో ప్రతిభాపాటవాళ్లు ఉన్నాయని, అయితే అనుకున్నంత మేరకు అవకాశాలు రావడంలేదని తెలిపారు. రచయిత అట్టాడ సృజన్ చిత్రాన్ని గొప్పగా తీశారని కొనియాడారు. చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్, హీరో శ్రీచరణ్, హీరోయిన్ గీత సైనిని అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, నిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు, ఆర్.శివకుమార్, ఉపాధ్యక్షులు ఉషారాణి, కోశాధికారి హుస్సేన్, రచయిత మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎబి బర్దన్‌కు నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : నిబద్ధత, నీతి, నిజాయితీ క్రమశిక్షణ గల ఎబి బర్దన్ గొప్ప దార్శినికుడని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. అల్లిపురం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఎ.బి బర్ధన్ 10వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బర్దన్ నాగపూర్ కేంద్రంగా అనేక కార్మిక సంఘాలను నిర్మాణం చేశారన్నారు. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. బర్ధన్ ఆశయాలు నేటి తరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రహిమాన్, సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు ఎ. విమల, ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె వనజాక్షి, ఎంఎ బేగం, ఎం. మన్మథరావు పాల్గొన్నారు.

మధురవాడ : సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి అర్ధేందు భూషణ్ బర్ధన్ 10వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మధురవాడలో సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ మాట్లాడుతూ, సంకీర్ణ రాజకీయాల శకంలో పార్టీని సమర్థవంతంగా నడిపించారని తెలిపారు. నీతి, నిజాయతీ, నిబద్ధతకు మారుపేరని, క్రమశిక్షణ గల నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు జి.వేలంగన్‌రావు, బి.బంగారయ్య, మహేష్, బి.సూరిబాబు, రమణ పాల్గొన్నారు.



బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

అనకాపల్లి : సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అగ్ర నేత ఏబీ బర్ధన్ పదవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మతసామరస్యం,లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు బర్ధన్ చేసిన కృషినికొనియాడారు. దేశంలో మతతత్వ శక్తులు అధికారంలోకి రానివ్వకుండా లౌకిక శక్తులను ఏకం చేసి యుపీఏ 1 ప్రభుత్వం అధికారంలోకి తేవడంలో బర్ధన్ కీలక పాత్ర పోషించారన్నారు. బర్ధన్ ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గ సభ్యులు జి ఫణీంద్ర కుమార్, జిల్లా సమితి సభ్యులు బి.బాబ్జి, రైతు సంఘ జిల్లా నాయకులు శంకర్రావు, సిపిఐ జిల్లా సత్యనారాయణ, పోతురాజు, సూరిబాబు పాల్గొన్నారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పరవాడ : ఎన్‌టిపిసి సింహాద్రి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2026 కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాంగణంలోని సంవాద్ హాల్‌లో హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ సమీర్ శర్మ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఒపి సమీర్ శర్మ మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన కేలండర్ ఎంతో ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. ఉద్యోగులందరికీ ఉపయోగపడే విధంగా అన్ని వవరాలను పొందుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఐక్యత, స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జీఎం (ఓ అండ్‌ఎం) ఎకె. రాజా, జీఎం (మెయింటెనెన్స్) హేమేంద్ర కుమార్ వర్మ, జీఎం (టిఎస్) ఎస్. పద్మప్రియ, హెచ్‌ఒహెచ్‌ఆర్ బి.బి. పాత్ర, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు జి. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకటేశ్వర రావు, అలాగే యూనియన్ల ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సభ్యులు, వెల్ఫేర్ బాడీ సభ్యులు,ఉద్యోగులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎన్‌టిపిసి సింహాద్రి హెచ్‌ఒపి సమీర్‌శర్మ

జాతీయస్థాయి యోగాకు 'అవంతి' విద్యార్థులు

ప్రజాశక్తి- తగరపువలస విజయనగరం జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల యోగా పోటీలలో అవంతి ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయస్థాయి యోగా పోటీలకు అవంతి కళాశాలల విద్యార్థినులు జామి తేజశ్రీ (తగరపువలస), కొంచాడ నందిని (నర్సీపట్నం), చీపాన భువనేశ్వరి (భోగాపురం) విజేతలుగా నిలిచారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్, డీమ్డ్ టుబీ యూనివర్సిటీ బెంగళూరులో యోగా పోటీలను నిర్వహించనున్నారు. జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్లు డాక్టర్ ఎ.చంద్రశేఖర్, విశ్వప్రసాద్, యోగా ఉపాధ్యాయులు పి.గాయత్రి అభినందించారు.



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మెరైన్‌లో ఉపాధిపై 'విశాఖ'లో అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్) మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'మెరైన్ రంగంలో భవిష్యత్ అవకాశాలు' అంశంపై సెమినార్ నిర్వహించారు. క్యాంప్‌బెల్ షిప్పింగ్ మెరైన్ చీఫ్ ఇంజినీర్ ప్రతాప్ కుమార్ మదుర, సినర్జీ మారిటైమ్ మెరైన్ చీఫ్ ఇంజినీర్ లక్కోజు శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, మెరైన్ సెక్టార్‌లో ఉద్యోగం ఏ విధంగా సాధించాలి, అందులో రాణించడానికి ఎలాంటి మెళకువలు పాటించాలో వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఎలా పెంపొందించుకోవాలో సూచించారు.

మరో అతిథి లక్కోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో మెరైన్ రంగంలో ఉన్న విస్తృత ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థులు ఎలాంటి కోర్సులు నేర్చుకోవాలి, సబ్జెక్టుపై టెక్నికల్ నాలెడ్జ్‌ను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా నేర్చుకోవాలో తెలియజేశారు. అనంతరం అతిథులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, ఎఒ పి.సుబ్బరాజు, అకడమిక్స్ డీన్ అండ్ మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి.శాంతారావు సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. సెమినార్ కో-ఆర్డినేటర్ కె.చందన పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మెకానికల్, ఇసిఇ, ఇఇఇ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న విశాఖ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు



సఫ్దర్ హష్మికి నివాళులర్పిస్తున్న అరుణ్‌జీ తదితరులు

సఫ్దర్ హష్మికి ఘన నివాళి

ప్రజాశక్తి -కరాస: ప్రజా కళాకారుడు, ప్రజా కళారూపాల సృష్టికర్త, వీధి నాటిక వైతాళికుడు సఫ్దర్ హష్మి వర్ధంతిని ఎన్ఎడి సమీపంలో ఉన్న హష్మి భవనంలోని ప్రజానాట్యమండలి కార్యాలయంలో నిర్వహించారు. సఫ్దర్ హష్మి చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు, గౌరవాధ్యక్షులు అరుణ్‌జి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సఫ్దర్ హష్మి గొప్పతనాన్ని వివరించారు. దేశ ఆర్థిక పరిస్థితులు, ధరల నియంత్రణ, ప్రజా సమస్యలపై ఆయన రచనలు చేసి, వీధి నాటకాలను ప్రదర్శించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారులు పద్మ, రాగిణి, ప్రజానాట్యమండలి చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్య దివ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. అంకురార్పణ అనంతరం భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళ శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.



గోధుమపిండి ప్యాకెట్‌ను అందిస్తున్న కార్పొరేటర్ బొండా జగన్నాథం

రేషన్ కార్డుదారులకు గోధుమపిండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డుదారులకు రూ.20కే గోదుమపిండి పంపిణీని 87వ వార్డు పరిధిలోని రేషన్ డిపోలలో కార్పొరేటర్ బొండా జగన్నాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సర కానుకగా గోదుమపిండిని రూ.20కే అందిస్తున్నట్లు తెలిపారు. రాగులను కూడా కార్డుదారులకు అందిస్తున్న చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్‌రాజు, ప్రగడ దానయ్య, పి.పెంటయ్య, కల్లేపల్లి శ్రీనివాస్‌వర్మ, మల్లా రాము, వై.భాస్కరరావు, కణితి ఈశ్వరరావు, కడుపుట్ల శ్రీను, అప్పలనాయుడు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యకారిణికి అభినందనలు

ప్రజాశక్తి -తగరపువలస : హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ కూచిపూడి కళావైభవం -2 గిన్నీస్ రికార్డ్ పేరిట ఇటీవల నిర్వహించిన ప్రదర్శనలో సాయి రవీంద్ర స్కూల్ 9వ తరగతి విద్యార్థిని కుప్ప లక్ష్య దీప్తి పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు సాధించడంపై అభినందనలు వెల్లువెత్తాయి. లక్ష్యదీప్తికి, శిక్షణ ఇచ్చిన ఝాన్సీ రాణికి స్కూల్ కరెస్పాండెంట్ బొగేల కృష్ణ, ప్రిన్సిపల్ వాండ్రసి సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



కుప్ప లక్ష్యదీప్తిని అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువకావాలి

ప్రభుత్వ విప్ గణబాబు



'డిన్నర్ విత్ ఆఫీసర్స్ అండ్ కేడర్'లో మాట్లాడుతున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్ గణబాబు కోరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో 'డిన్నర్ విత్ ఆఫీసర్స్ అండ్ కేడర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ పథకాల జిఒలపై పూర్తి అవగాహనతో ఉండాలని, వార్డు స్థాయిలో శానిటేషన్, వాటర్ సప్లై సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, పి4 స్పెషల్ ఆఫీసర్ మాధవి, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, గోపాలపట్నం సిఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సిఐ సురేష్, డిఇ వీరయ్య, టిడిపి నాయకులు బొడ్డేటి విజయ్, దాడి రమేష్ నాయుడు, పొన్నాడ రమణారావు తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ సాయి

రహదారి నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-మధురవాడ : జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిఎం.పాలెం ట్రాఫిక్ సిఐ సాయి కోరారు. పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ, అతివేగం, అజాగ్రత్త వల్ల అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు పాటించాల్సిన ముఖ్య నియమాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, ఇది ప్రమాద సమయంలో ప్రాణరక్షణ కవచంలా పనిచేస్తుందని చెప్పారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేకుండా, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానాలు విధిస్తూనే, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జెడికి జిప్సా నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖపట్నం పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జెడి) బి.విజయభాస్కర్‌ను గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిప్సా కేలండర్, డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ప్రయివేటు పాఠశాలల్లోని పలు సమస్యలు, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర, ప్రయివేటు ఉపాధ్యాయులకు శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిప్సా గౌరవాధ్యక్షులు పి.భాస్కరరావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, కార్యవర్గ సభ్యులు పి.మురళీసుందర్, జె.రమేష్‌నాయుడు తదితరులున్నారు.



ఆర్‌జెడిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జిప్సా నాయకులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా కోశాధికారి జి చంద్రుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కోశాధికారి జి.చంద్రడు అధ్యక్షతన అనుబంధ సంఘాల అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతూ, 104 ఉద్యోగులకు భవ్య యాజమాన్యం తీవ్రమైన అన్యాయం చేస్తోందన్నారు. . ఎన్నిసార్లు యాజమాన్యాన్ని కలసినా సమస్యలను పరిష్కరించడం లేదనానరు. తప్పని పరిస్థితిల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గతనెల 19న ముందస్తు నోటీసు జారీ చేసి, వివిధ రూపాల్లో నిరసన చేస్తున్నా భవ్య యాజమాన్యంలోగానీ, ప్రభుత్వంలోగానీ స్పందన లేదన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ భవ్య యాజమాన్యం తగ్గించిన వేతనాలు సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని, దానితో పాటుగా ప్రభుత్వం కూడా జీతాలు పెంచే ఆలోచన చెయ్యాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్గనైజింగ్ కార్యదర్శి సీరంరెడ్డి భార్గవ్ మాట్లాడుతూ తొలగించిన క్యాజువల్ లీవ్‌లు పునరుద్ధరించాలని, అన్ని ప్రభుత్వ సెలవులు 104 ఉద్యోగులకు కూడా వర్తింప చెయ్యాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మణీసు మాట్లాడుతూ తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించి ఉద్యోగుల మీద పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఇప్పుడున్న పూల్ విధానం సరైంది కాదని, పునరాలోచన చెయ్యాలని అన్నారు.104లో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్ లకు శ్లాబ్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 104 డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జిఒ 7. ప్రకారం రూ.18,500 వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. భవ్య యాజమాన్యం నిర్వాకంపై ప్రశించిన 104 ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపై అక్రమ సస్పెన్షన్ రద్దు చెయ్యాలని, లేకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు.కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కాళ్ళ తేలయ్యబాబు, ఎం మూర్తి, ఎం, ప్రశాంత్, కుమార్, ఏ మధు, సతీష్, వై వి నాయుడు, ఎం శ్రీను, ఎం ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోశాధికారి చంద్రుడు

మన్యంలో కార్మిక వర్గానికి అండగా సిఐటియు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో వివిధ కార్మిక, శ్రామిక వర్గాలకు సిఐటియు అండగా నిలిచింది. గత రెండున్నర దశాబ్దాలుగా వారి మనుగడ కోసం అనేక పోరాటాలతో ముందు సాగింది. ఈ ప్రాంతంలోని 20కి పైగా కార్మిక, ఉద్యోగ సంఘాలతో సిఐటియు అనుబంధం పెనవేసుకుంది. ఎర్ర జెండా సాక్షిగా అనేక సమరశీల పోరాటాలతో కార్మిక వర్గాల్లో ఐక్యతను సాధించి వారికి వెన్నుదన్నుగా నిలిచింది.



ప్రదర్శన చేపడుతున్న సిఐటియు నాయకులు, సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్)

ప్రజాశక్తి - పాడేరు

పాడేరు ఏజెన్సీలో 1998- 99లో కార్మిక వర్గాలకు అండగా సిఐటియు ఆవిర్భవించింది. అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అరకు లోయలోని పద్మాపురం కొత్తవలస గార్డెన్స్‌లో ఐటిడిఎ (హెచ్ఎన్‌టిసి) డైలీ వేజ్ కార్మికుల సంఘానికి అనుబంధంగా సిఐటియు ప్రస్థానం మన్యంలో మొదలైంది. అప్పట్లో 40 మంది డైలీ వేజ్ కార్మికులు ఈ హెచ్‌ఎంటిసిలో పనిచేసేవారు. వీరికి కిల్లో అప్పన్న అనే గిరిజన కార్మికుడు.. సిఐటియు తరపున నాయకుడిగా వ్యవహరించారు. ఆ తరువాత సిఐటియు అంచలంచెలుగా అనేక కార్మిక, శ్రామిక వర్గాలకు అండగా నిలిచి సమరశీల పోరాటాలతో మరింత చేరువయ్యింది. మినుములూరు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కాఫీ కార్మికులకు అండగా నిలిచి 2001-02 సంవత్సరంలో సిఐటియు చేపట్టిన కాఫీ ఉద్యమంతో వారికి గట్టి భరోసా కల్పించింది. ఈ క్రమంలో ఏజెన్సీలోని అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల (సిహెచ్‌డబ్ల్యు) వేతన సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించి వారికి అండగా నిలిచింది. అదే విధంగా ఫారెస్ట్ వర్కర్స్ యూనియన్, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్, ఎపిఎండిసి ట్రైబల్ వర్కర్స్ యూనియన్, ప్రయివేట్ టూరిజం వర్కర్స్ యూనియన్, జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్, వెలుగు విఒఎల సంఘం, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్, ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, జిసిసి హమాలీల సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, మోటారు వర్కర్స్ యూనియన్, కాఫీ లైజన్ వర్కర్ల సంఘం, 104, 108, ఉద్యోగ సంఘాలు, తదితర కార్మిక సంఘాలు సిఐటియు గొడుగు కింద పనిచేశాయి.

సమరశీల పోరాటాలతో వెన్నుదన్ను

జెండావిష్కరణలు. బైక్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ నేపథ్యంలో మన్యం కార్మిక వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అంతటా కార్మికుల్లో సందడి అలుముకుంది. డిసెంబర్ 15 నుంచి మన్యంలో కార్మిక సంఘాలు సిఐటియు అఖిలభారత మహాసభ గురించి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. ఇంటింటా కరపత్రాలు పంపిణీ, మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, విరాళాలు సేకరణ తదితర తదితర ప్రచార కార్యక్రమాలను నిర్వహించాయి. కార్మికవాడల సముదాయాలు, కార్మిక సంఘాల నేతల గృహాలపై జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. పాడేరు ఏజెన్సీలోని సుమారు 100 చోట్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు ఆధ్వర్యంలో సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కోసం పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అఖిల భారత మహాసభలో భాగంగా ఈ నెల 4న విశాఖలో జరిగే సిఐటియు మహా ప్రదర్శన, బహిరంగ సభకు భారీగా తరలివెళ్లేందుకు మన్యంలోని అన్ని ప్రాంతాల్లో కార్మికులు సమాయత్తం అవుతున్నారు. పాడేరు ఏజెన్సీ నుంచి సుమారు 5 వేల మంది కార్మికులు తరలివెళ్లనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు వెల్లడించారు.


మాట్లాడుతున్న శివప్రసాద్

గ్రంథాలయాలతోనే ప్రజా చైతన్యం

ప్రజాశక్తి-గాజువాక

ప్రజల చైతన్యం కోసం గ్రంథాలయాలు అవసరమని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు వల్లూరి శివప్రసాద్ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై శుక్రవారం 'గ్రంథాలయాల ఆవశ్యకత - సవాళ్లు ' అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చైతన్యం, జ్ఞాన సంపద, మానవత విలువల కోసం గ్రంథాలయ ఉద్యమం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజలు చెల్లించే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని, 1960లో ప్రకాశం పంతులు చట్టం చేస్తే, ఆ చట్టం ఇప్పుడు అమలు కావడం లేదని చెప్పారు. గ్రంథాయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని పాలకులు 1980లోనే ప్రయత్నాలు మొదలు పెట్టారని గుర్తుచేశారు. కర్ణాటక ప్రభుత్వం 3,576 గ్రంథాలయ పోస్టులు నియామకం చేపట్టిందన్నారు. తమిళనాడు ప్రభుత్వం సంవత్సరానికి రూ.100 కోట్లు గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేయడానికి కేటాయించిందన్నారు. మన రాష్ట్రంలో ఏడాది రూ.140 కోట్లు గ్రంథాలయాల నిర్వహణకు ఇవ్వాల్సి ఉండగా, రూ40 కోట్లు ఇచ్చి, మిగతా రూ.100 కోట్ల కోసం ఏమీ చెప్పడం లేదన్నారు. భవంతులు కడితే అభివృద్ధి కాదని, పిల్లలు జ్ఞానసంపద కూడా సంపాదించాలని అభిప్రాయ పడ్డారు. విద్యా వ్యవస్థలో కూడా బట్టి విధానం ర్యాంకులే తప్ప కొత్తదనం లేదన్నారు. ప్రభుత్వాలు ఓట్లు రాబట్టుకోవడానికి చూస్తున్నాయి గాని గ్రంథాలయ అభివృద్ధికి ప్రయత్నించడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రంథాలయ శాఖ అనేది స్వతంత్రంగా ఉండాలి తప్ప విద్యా శాఖలో ఉండకూడదని స్పష్టంచేశారు. గ్రంథాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వంతో పాటు మనం కూడా కృషి చేయాలని కోరారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించాలన్నారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కెంగార మోహన్ మాట్లాడుతూ గతంలో గ్రంథాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండేదన్నారు. గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని, ఆరేళ్లుగా పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్నారు. గ్రంథాలయాలు గ్రామాల్లో కూడా విస్తరించాలని ఆకాంక్షించారు. ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెసర్ ధనరాజు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయాలు కొన ఊపిరితో నడుస్తున్నాయని అన్నారు. మేధావులు వికసించే చోట ప్రశ్నించేతత్వం పెరుగుతుందని తెలిపారు. విద్యావంతుల మౌనం వీడాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి కుమార్ రాజా మాట్లాడుతూ సెస్ బకాయిలు వసూలైన వెంటనే అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు బి.ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అనంతరం మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న జిసిసి ఎమ్‌డి కల్పనాకుమారి, చిత్రంలో వెంకటేశ్వరరావు

పుస్తక మహోత్సవాన్ని సందర్శించిన జిసిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-గాజువాక

శ్రామిక ఉత్సవ్ వద్ద ఏర్పాటు చేసిన విశాఖ పుస్తక మహోత్సవాన్ని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాల స్టాల్స్‌లో కలియదిరిగారు. అవసరమైన పుస్తకాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్, జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ.. ఎంతమంది వస్తున్నారు.. ఏయే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పుస్తకాలు కొనుగోలు చేశారు. చాలా సమాచారంతో కూడిన పుస్తకాలను అందుబాటులో ఉంచారని, పుస్తక ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనను మళ్లీ ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
శనివారం 3
జనవరి 2026




ధింసా నృత్యంతో ఆకట్టుకున్న గిరిజన కళాకారులు


డ్యాన్సులతో హుషారెక్కిస్తున్న యువత


డ్రమ్స్ మోగిస్తూ మహిళల సందడి


ఎర్రజెండా గొప్పతనాన్ని వివరిస్తూ మహిళా కళాకారుల నృత్యం


అభ్యుదయ గేయాల ఆలాపన

చివరి రోజూ అదే జోరు

ముగిసిన శ్రామిక ఉత్సవ్ ● అనూహ్య స్పందన



హీరోయిన్ గీత సైని

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

ఆట, పాట, మాటలతో.. ప్రదర్శనలతో ఆద్యంతం కళాకారులు... ఆహూతుల్లో ఉత్సాహాన్ని నింపారు. సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్ శుక్రవారం ముగిసింది. ఏడు రోజులపాటు నిర్వహించిన కార్మికుల పండగ ఉత్సాహ పూరితంగా సాగింది. ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు, గేయాలు.. పాలకులు, పెట్టుబడిదారుల గుండెల్లో తూటాల్లా పేలాయి. ఆద్యంతం చైతన్యాన్ని నింపాయి. జివిఎంసి కళాకారుల 'తీన్ మార్' సభికుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఉపాధ్యాయులు జి.గౌరినాయుడు రాసిన 'నా దేశ గత చరిత్ర నెత్తుటి మరకే... ఐనా నా తల్లి మనసు మీగడ తరగ' అంటూ గత దేశ చరిత్రను, ప్రస్తుత దేశ పరిస్థితులను అన్వయిస్తూ వివరించారు కళాకారులు. 'మృత వీరుల చెరగని మువ్వన్నెల పతాకా.. విశ్వ వీణ తంత్రులై.. విమల గానమౌతుందని..' అంటూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన త్యాగధనుల స్ఫూర్తిని నింపుకుని పోరాడాలని, తద్వారానే పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని వివరించే ప్రయత్నం చేశారు. 'రాతి గుండె చప్పుడు.. జలియన్ వాలాబాగ్ .. ప్రవహించే వాగులు వెచ్చని నెత్తుటి వాగు..' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. 'పట్టు పట్టక్క... జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండదండక్క' అంటూ విజయనగరం జిల్లా అంగన్వాడీలు ప్రదర్శించిన కోలాటం ఆద్యంతం ఆసక్తి కలిగించింది. కిశోర బాలికలకు నైతిక విలువల పెంపుదలకు అంగన్వాడీలు చేస్తున్న కృషిని వివరించారు 'ఒకరిద్దరు పిల్లలు చాలు.. ఆడపిల్లలే మేలని' పేర్కొంటూ పాడుతూ.. ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

'సిఐటియు జెండా ఎత్తి.. మనమంతా దండెత్తి.. హక్కులను సాధిద్దాం..' అంటూ అంగన్వాడీల కోలాటం ప్రదర్శన ద్వారా వారు చేపట్టిన పోరాట పటిమను వివరించారు. అంగన్వాడీ ప్రాజెక్టును గంగలో కలిపేస్తే ఊరుకోబోమంటూ కోలాట ప్రదర్శన ద్వారా పాలకులను హెచ్చరించారు. 'సిఐటియు సంఘమో.. పోరాటాల రంగమో..' అంటూ అంగన్వాడీలు కోలాట ప్రదర్శన ద్వారా సిఐటియు విశిష్టతను వివరించారు. వారానికి రెండు గుడ్లు పెట్టాలని చెబుతారు.. అప్పు తెచ్చి వండి పెడితే.. కిరాణా దుకాణం యజమానికి సకాలంలో డబ్బులు చెల్లించుకుంటే పడే ఇబ్బందులను, అవస్థలను ప్రస్తావించారు అంగన్వాడీలు. 'హల్లా బోల్' వీధినాటిక ప్రదర్శిస్తున్న ప్రజా కళాకారుడు సఫ్దార్ హష్మీ ఇదే రోజున నాటి కాంగ్రెస్ పాలకుల చేతిలో నడి రోడ్డుపై అత్యంత కిరాతకంగా హత్య చేయబడ్డాడని ప్రజానాట్య మండలి కళాకారులు గుర్తు చేస్తూ, ఆయనను స్మరించుకుంటూ తొలుత హష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంగాన్ని అప్పటి పాలక వర్గాలు తమ ప్రచార బాకాగా మలుచుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు హష్మీ. ఆయన స్ఫూర్తితో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే మనమిచ్చే ఘన నివాళి అని కళాకారులు స్పష్టం చేశారు.






ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు


శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం


సిఐటియు అఖిల భారత నాయకులకు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

శ్రామిక ఉత్సవ్'లో విజ్ఞాన పరిమళాలు

ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

శాస్త్ర విజ్ఞాన ప్రచారాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు మూఢ విశ్వాసాలను ప్రజల్లో పెంచి పోషిస్తూ, జనాల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు విమర్శించారు. గత ఏడు రోజులుగా ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా జన విజ్ఞాన వేదిక నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఎ.వి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ కార్మికుల కష్టంతో చెమట చుక్కతో సంపదని సృష్టిస్తే ఆ సంపదను కొంతమంది పెట్టుబడిదారులకు ప్రస్తుత ప్రభుత్వాలు ధారదత్తం చేస్తున్నాయని విమర్శించారు. ఆదిమ సమాజం నుంచి ఈనాటి ఆధునిక సమాజం వరకు మనిషి మెదడులో తలెత్తిన ప్రశ్న.. అప్పటినుంచి ఇప్పటివరకు పాలకులను ప్రశ్నించడం ద్వారానే అనేక నూతన ఆవిష్కరణలు వెలుగుచూశాయని, అవన్నీ కూడా ప్రజలు, కార్మికుల సౌకర్యవంతమైన జీవనానికి దోహదపడ్డాయని గాజువాక ప్రజా వైద్యశాల డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు విద్యా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజల హక్కులను కాల రాస్తున్నాయన్నారు. ప్రజలందరూ సంఘటితమై పోరాడితే తప్ప ఈ పరిస్థితి నుంచి బయట పడలేమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్య, వైద్య రంగాలను అంగట్లో [illegible] మార్చివేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వైఎల్ నరసింహారావు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచన, సైన్స్ మనిషి జీవితంలో అంతర్భాగమన్నారు. ప్రజల దైనందిన జీవితం ఆచరణాత్మకంగా ఉండాలని, కానీ ప్రభుత్వాలు ప్రజల్లో మూఢవిశ్వాసాలను పెంచి పోషిస్తూ వారిని ప్రశ్నించే వారిపట్ల ద్వేష భావాన్ని రగిలిస్తూ దమనకాండకు, దాడులకు, అక్రమ అరెస్టులకు పురిగొల్పే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ అధ్యక్షత వహించారు. ఏడు రోజుల పాటు జరిగిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో సుమారు ఏడు వేల మంది ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఎగ్జిబిషన్లో పాల్గొన్న కాలేజీలకు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాయత్రి మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ ఇ.రవికిరణ్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ గ్రీన్వైడ్స్ ఫైర్ అండ్ సేఫ్టీ కాలేజ్ కోఆర్డినేటర్ సవిత, పెందుర్తి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ సీనియర్ లెక్చరర్ డాక్టర్ శ్రీనివాస్, సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజీ కన్వీనర్ డి.కిషోర్ కుమార్, విశాఖ ఇంజనీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ కోఆర్డినేటర్ డాక్టర్ సంపదక్షిణమూర్తి, జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా నాయకులు వై.ఆర్.కె. ప్రసాద్, జెవివి రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు, జిల్లా నాయకులు గోపాలరావు, రత్నారావు, ఆట్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎల్.నర్సింహారావు

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు

'శ్రామిక ఉత్సవ్'లో ప్రముఖ దర్శకులు రాజమురుగన్


హష్మీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు రాజమురుగన్, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు సాధ్యమని ప్రముఖ తమిళ దర్శకుడు రాజమురుగన్ అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న 'శ్రామిక ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ముగిసింది. చివరి రోజు 'ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉపాధి - హక్కులకై ఉద్యమిద్దాం' అన్న థీమ్‌తో కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమురుగన్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత నటుడు చార్లీ చాప్లిన్ తన మూగ సినిమాల ద్వారా ఆకలి విలువను అద్భుతంగా చిత్రీకరించారని కొనియాడారు. చాప్లిన్ అమెరికా, ఇంగ్లాండ్ వంటి ధనిక దేశాల్లో పెరిగినా, ఆయనకు ఆకలి గురించి ఎలా తెలుసని అడిగితే 'నేను కమ్యూనిస్టును కాబట్టే ఆకలి విలువ తెలిసింది' అని ఆయన చెప్పుకొచ్చిన విషయాన్ని రాజమురుగన్ గుర్తుచేశారు. ఆకలిని ప్రతిబింబించేందుకు భాషతో పనిలేదని ఆయన నిరూపించారన్నారు. నేటి భారతదేశంలో మితవాద శక్తులు సమాజాన్ని విడదీస్తున్నాయని, వారికి వ్యతిరేకంగా మనం ప్రేమ, త్యాగం వంటి విలువలను ఆయుధాలుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సంపదలో మెజారిటీ వాటా కేవలం 60 వేల మంది చేతుల్లోనే ఉందని, పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కుల, మత బేధాలను విస్మరించి సోషలిజం సాధన కోసం వర్గ పోరాటమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు.

సభాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టజీవుల శ్రమ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన ఎండగట్టారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ సామాన్యులకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని, విద్యా చట్టం పేరుతో కేవలం డబ్బున్న వారికే చదువును పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చదువుకున్న యువతకు నామమాత్రపు జీతాలతో కార్పొరేట్ కంపెనీలలో బానిస చాకిరీ మిగిలిందని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆంక్షల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నెలకు ఐదు కేజీల బియ్యంతో ఒక కుటుంబం ఎలా జీవించగలదని ఆయన పాలకులను నిలదీశారు.


మాట్లాడుతున్న దర్శకుడు రాజమురుగన్, వేదికపై ఉమామహేశ్వరరావు, అట్టాడ సృజన్, శ్రీచరణ్, గీత సైని

ఘనంగా ముగింపు

కార్యక్రమం ముగింపులో భాగంగా వారం రోజుల పాటు వివిధ విభాగాల్లో సహకరించిన వాలంటీర్లకు, కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువ దర్శకుడు అట్టాడ సృజన్, 'కన్యాకుమారి' చిత్ర నటులు శ్రీచరణ్, గీత సైని, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, కుమార మంగళం, మోహన్‌రావు, సిద్ధిరెడ్డి జోగిరాజు పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి (ఫైల్)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వెనుక తెలుగు ప్రజల చారిత్రక పోరాట నేపథ్యం వుంది. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు ఏకోన్ముఖంగా పోరాడి సాధించుకున్న ఘనత దీనిది. ఉక్కు పరిశ్రమ పురోగమనంలో కార్మికులు, ఉద్యోగుల కఠోర శ్రమ వుంది. ప్రభుత్వాల సహాయ నిరాకరణ, కుట్రలపై ప్రతిఘటన వుంది. ఆది నుంచి ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను ఎదురొడ్డి ఉక్కు పరిశ్రమను నిలబెట్టుకోవడంలో ప్రజల పాత్ర వుంది. సోషలిస్టు రష్యా సహకారం వుంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు నాలుగున్నరేళ్లుగా కుట్రలు చేస్తున్నా సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటాలతో తిప్పికొడుతూ వస్తోంది.

ఉక్కు పరిరక్షణకు సమరశీల పోరాటాలు

సిఐటియు నేతృత్వాన ఉద్యమిస్తున్న కార్మికవర్గం


బైక్‌ర్యాలీ చేపడుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి – విశాఖపట్నం

అది 1963వ సంవత్సరం. ఐదో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికే భిలాయ్, బొకారో, రూర్కెలా, దుర్గాపూర్‌లో స్టీల్‌ప్లాంట్‌లు ఉండడంతో, సముద్ర తీరానవున్న విశాఖపట్నం అనుకూల స్థలమని ఆంగ్లో ఇండియన్ కన్సార్టియం ప్రతిపాదించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని 1966 జులై 1న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనికి ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా లేదు. అయితే, వెనుకబడిన విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి దొరుకుతుందని నాడు అందరిలో ఆశ చిగురించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని 1966 అక్టోబర్ 21న విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అని నినదించారు. రైళ్లను ఆపేశారు. ఉద్యమ నినాదం తెలుగు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. సాధించుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఇది భరించలేని ప్రభుత్వం 1966 నవంబరు 1న ఉద్యమకారులపై కాల్పులు జరిపి 9 మందిని బలితీసుకుంది. దీన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువకులు, ప్రజలపై ప్రభుత్వం దమనకాండకు దిగి 32 మంది ప్రాణాలను బలిగొంది.

కాల్పులను నిరసిస్తూ, విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలన్న డిమాండ్‌తో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, తెన్నేటి విశ్వనాథం వంటి 14 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. అమృతరావు నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజాపోరాటాల ధాటికి తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 1970 ఏప్రిల్ 17న నాటి ప్రధాని ఇందిరా గాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ప్రకటించి, 1971 జనవరి 20న పైలాన్ ఏర్పాటుచేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి 16,500 మంది రైతులు ముందుకొచ్చి, 64 గ్రామాలు ఖాళీచేసి 22 వేల ఎకరాల భూములిచ్చారు.

కేంద్రం సహాయ నిరాకరణ : అప్పులతో వడ్డీల భారం

స్టీల్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 1982 ఫిబ్రవరి 18న వేరుచేశారు. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సిన స్టీల్‌ప్లాంట్‌ను రేషనలైజ్డ్ కాన్సెప్ట్ పేరుతో 3.4 మిలియన్ టన్నులకు పరిమితం చేసి కేంద్రం కేవలం రూ.4,889 కోట్లు కేటాయించింది. మిగిలిన డబ్బులు వివిధ బ్యాంకుల్లో అప్పులు చేసి 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకొని 1991లో ఉత్పత్తి ప్రారంభించారు.

దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సహకారం లేకపోవడంతో, అప్పులుచేసి నిర్మించడంతో వడ్డీల భారం పెరిగింది. వడ్డీలు పెరిగి నష్టాలు రావడంతో 1999లో బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బిఐఎఫ్ఆర్‌కు నివేదించి, ప్రయివేటీకరణ వాదన ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగడంతో రూ.1500 కోట్లు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించకపోయినా, బహిరంగ మార్కెట్‌లో గనులు కొనుక్కొని, 120 శాతం సామర్థ్యంతో నడిచేలా కార్మికులు, ఉద్యోగులు విశేష కృషిచేశారు. 2002 నుంచి 2015 వరకు సుమారు రూ.12,900 కోట్లు లాభాలు వచ్చాయి. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును ప్లాంట్ తిరిగి చెల్లించగలిగింది. అనంతరం మిగులు సొమ్ముతో పాటు, రూ. 18 వేల కోట్లకుపైగా అప్పుచేసి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2008 నుంచి 2019 వరకు 10 వేల పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. నిర్వాసిత కుటుంబాలకు, ఎస్‌టి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మాజీ సైనిక ఉద్యోగులు, మహిళలు, వికలాంగులకు ఉద్యోగాలు లభించాయి.

వెంటాడుతున్న ముడి ఖనిజ సమస్య

ప్లాంట్ సామర్థ్యం పెంచుకున్నా, ముడిఖనిజం సమస్య స్టీల్‌ప్లాంట్‌ను వెంటాడుతూనే వుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ స్టీల్ పరిశ్రమలతోపాటు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే చేపట్టని పోస్కోకు సైతం ఐరన్‌ఓర్ గనులు కేటాయించింది. కానీ, పభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నేటికీ ఐరన్‌ఓర్ కేటాయించలేదు. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లకు ఒక టన్ను ఉత్పత్తికి కేవలం రూ.500 ఖర్చు అవుతుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో ఐరన్ ఓర్ టన్నును రూ.5 వేల నుంచి రూ.8 వేలకు కొంటోంది.


వైజాగ్ స్టీల్‌ప్లాంట్

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సెయిల్ నుంచి నుంచి స్టీల్‌ప్లాంట్‌ను వేరుచేసినప్పుడు బైలదిల్లాలోని 4, 5 బ్లాకుల గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, ఐరన్ ఓర్ సరఫరా చేస్తామని నమ్మబలికారు. అయితే మన రాష్ట్రంలోని ఐరన్ ఓర్ గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిఐటియు హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని నాటి ప్రభుత్వానికి ఆదేశించారు. అయినా గనులు కేటాయించకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. సముద్ర తీరాన స్టీల్‌ప్లాంట్ నిర్మించినట్టయితే రవాణాకు అనుకూలమై, అత్యంత తక్కువ ఖర్చుతో ముడిసరుకును దిగుమతితోపాటు, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని భావించారు. అనుబంధంగా పిపిపి విధానంలో గంగవరంలో పోర్టు నిర్మించినా, దాన్ని అదానీకి కట్టబెట్టారు. ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడింది. ముడిసరుకు రాకుండా ఇబ్బందులను సృష్టించడంతో రూ.మూడు వేల కోట్లు పైగా నష్టం వాటిల్లింది.

పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలంటూ నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వ్యాపారం ప్రభుత్వ పని కాదంటూనే ప్రభుత్వ సంస్థలు చావడానికే పుట్టాయంటూ మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటైన వీటిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని 2021 జనవరి 27న నిర్ణయించింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కుపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఆధారపడి సుమారు లక్ష మంది జీవిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక తలసరి ఆదాయం గాజువాకకు ఉండడానికి విశాఖ ఉక్కు కారణం. అయినా దీన్ని ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తుండటంతో సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటం చేస్తోంది. ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరాను కావాలనే నిలిపేస్తోంది. ఉద్యోగులపై ఆర్థిక దాడి చేస్తోంది. కొన్ని నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడంలేదు. ఉద్యోగులను విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలు సాగుతున్నాయి. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీనిచ్చి గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు దుర్మార్గ వైఖరిని అవలంబిస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్‌లను సిఐటియు డిమాండ్ చేస్తోంది.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్)

రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం



ఆపరేషన్ థియేటర్ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఎన్‌టిఆర్ ఆస్పత్రిలో అదనపు, అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ,సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నోవోప్రో లైఫ్‌సెన్సెస్ కంపెనీ రూ. కోటి సిఎస్ఆర్ నిధులతో అప్‌గ్రేడ్ చేసిన మాడ్యులర్, లామినార్ ఆపరేషన్ థియేటర్లను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా మాడ్యులర్, లామినార్ ఎయిర్‌ఫ్లో టెక్నాలజీతో నిర్మించిన, ఆపరేషన్ థియేటర్లలో సురక్షితమైన, అత్యంత శుభ్రమైన, అవసరానికి అనుగుణంగా మార్చుకోగల శస్త్రచికిత్స వాతావరణాన్ని అందిస్తూ, ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో పలు అంశాలపై సమీక్షించారు. తర్వాత ఆసుపత్రి పరిసనాలను పరిశీలించి జోనల్ కమిషనర్ చక్రవర్తి, టిపిఒకు సూచనలు చేశారు. డిఎంహెచ్ఒ హైమావతి, ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ కృష్ణారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్. శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్స్ ఆళ్ళ రామచంద్రరావు, తాడి శాంతికుమారి రామకృష్ణ, గొర్లె శేఖర్, డాక్టర్ డిడి.నాయుడు, ఉల్లింగిల రమేష్ పాల్గొన్నారు.

మిషన్ పునర్వనంతో చెట్ల పరిరక్షణ

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : వందల సంవత్సరాల క్రితం చెట్లను పరిరక్షిస్తూ జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. మిషన్ పునర్వనం కార్యక్రమాన్ని చేపట్టరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవ మనుగడకు,సరైన జీవన విధానానికి ముఖ్యమైనవి గాలి, నీరు, ఆహారమని, వాటికోసం మొక్కలు నాటి సంరక్షించడం అవసరమన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్ సహకారంతో 30వేల పైచిలుకు మొక్కలు నాటామన్నారు. కొండకర్ల నుంచి మొదలుకుని అనేక మొక్కలు నాటుతున్నామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా అనేక చెట్లు తొలగించడం వలన కలిగిన బాధను కలెక్టర్ గారితో చర్చించి.ఈ మిషన్ పున్ణవనం కార్యక్రమానికి పూనుకున్నామన్నారు కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యసంపద పరిరక్షణపై వర్క్‌షాప్



వర్క్‌షాప్ పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ ధనుంజయరావు

ప్రజాశక్తి- కె. కోటపాడు : భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో మత్స్య సంపద పరిరక్షణపై వర్క్ షాపులు నిర్వహిస్తున్నామని జోనల్ కమిషనర్ సి.ధనంజయరావు తెలిపారు. శుక్రవారం కె. కోటపాడు వేణు విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ బొడ్డు. వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతూ,. ప్రధానమంత్రి మత్స్యయోజన పథకం ద్వారా ఈ ఏడాది కె. కోటపాడులో విద్యార్థులు, మత్స్యకారులకు సముద్రంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, చేపల పట్టడంలో మెలకువలు, సముద్రం కలుషితం కాకుండా తీసుకోవలసిన చర్యలు, బోటులు నడపడంపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. ఎగ్జిబిషన్‌లో సూర్య బాసర, ఎ.కోడూరు, కె.కోటపాడు జడ్పీహెచ్ఎస్,. వేణు విద్యానికేతన్ విద్యార్థులు, కరస్పాండెంట్ బొడ్డు వేణు, టీచర్లు గొర్లి. దేముళ్ళ, గొంప. రోహిణి పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌లోనే క్రషింగ్ చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, రైతు సంఘాల నేతలు



సమావేశంలో పాల్గొన్న రైతులు, రాజకీయ పార్టీల నేతలు

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ సుగర్స్‌ను ఆధునికీకరించి అభివృద్ధి చేస్తామన్న కూటమి ప్రభుత్వం హామీని అమలు చేయాలని అఖిలపక్ష రైతుసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం చోడవరం మాధవ కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, అమ్‌ఆద్మీ నేత కొణతాల హరినాధరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, జనసేన నాయకులు జెర్రిపోతుల నానాజీ, న్యాయవాది కే డేవిడ్, వైసిపి నేతలు వెంపల ఆనంద్ ఈశ్వరరావు మాట్లాడారు. తక్షణమే ఫ్యాక్టరీని ఆధునికరించి రైతులు,కార్మికులు బకాయిలు చెల్లించాలని, సంకిలిలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి చెరకు తరలించకుండా గోవాడలోనే క్రషింగ్ నిర్వహించాలన్నారు. రెండు నియోజకవర్గాల్లో లక్ష మందికి పైగా ఆధారపడిన పరిశ్రమను మూసేయడం సరికాదన్నారు. వెంటనే ఫ్యాక్టరీ తెరిపించకుంటే దశలవారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు వైసిపి నేతలు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రూ.89కోట్ల ఆర్థికసాయం అందించి గోవాడ సుగర్స్‌ను ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏడువాకు సత్యారావు, బూరే బాబురావు, బొడ్డేటి సూర్యనారాయణ, సేనాపతి సత్యారావు, బొడ్డేటి సింహాచలం, గోతిరెడ్డి రాంబాబు, షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కె.భాస్కరరావు, శరగడం రామానాయుడు పాల్గొన్నారు.

ఆహార కమిషన్ ఛైర్మన్ విస్తృత పర్యటన



సూచనలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలో రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ చింతా ప్రతాపరెడ్డి శుక్రవారం ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు వివిధ శాఖల సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలకడం జరిగింది. అనంతరం యలమంచిలిలోనివివిధ పాఠశాలలు, అంగన్వాడి పాఠశాలలు, రేషన్ డిపోలును సందర్శించి, ఆహార క్వాలిటీ, క్వాంటిటీ, విద్యార్థుల హాజరు, ఆహార నిల్వల రికార్డ్స్ పరిశీలించారు. అనంతరం ప్రతాప్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, అన్ని పాఠశాలలకు పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు మెనూ అమలుపై ప్రశ్నించి, పిల్లల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అంగన్వాడీలు, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలల రికార్డ్స్ పరిశీలించి మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అయితే కొక్కిరాపల్లి గురుకులం పాఠశాలలో చికెన్ తక్కువ పెడుతున్నారు, వంటలు సరిగా చేయడం లేదని, తాగునీటి సమస్య ఉందని ప్రతాపరెడ్డి బృందం దృష్టికి రాగా, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల కేర్ టేకరు, సంబంధిత అధికారులను ప్రశ్నించి, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారపదార్థాలు వండి వడ్డించాలని సూచించారు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల విద్యార్థులకు తన మొబైల్ నెంబర్ ఇచ్చి, ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తేవాలని సూచించారు.కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిఎస్ఓ పివిఎస్ఎన్ మూర్తి, సివిల్ సప్లైస్ డిఎం జయంతి, ఐసిడిఎస్ పీడీ సూర్య లక్ష్మి, పిఓ ఇందిర దేవి, తహసీల్దార్ వరాహలురావు, ఎంఇఓ సూర్య ప్రకాష్, ఐసిడిఎస్ అధికారులు, వైద్య సిబ్బంది, విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యం

పరవాడలో 'మన పల్లె, మన ఎమ్మెల్యే'లో పంచకర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.

ప్రజాశక్తి పరవాడ : పరవాడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. శుక్రవారం మన పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పరవాడలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అధ్యక్షతన గ్రామసభలో మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఫార్మాసిటీ, ఎన్‌టిపిసి హిందూజా పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిశ్రమల కాలుష్యంపై కఠిన చర్యలు చేపడతామని, బొగ్గు లారీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పరవాడ పిహెచ్‌సి అప్‌గ్రేడ్, డిగ్రీ కళాశాల స్థాపనకు కృషి చేస్తామన్నారు. అలాగే విశ్వబ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు, అంధులు, మసీదుల భవనాల నిర్మాణానికి ఒక్కొక్కరికి 10 సెంట్ల భూమి కేటాయిస్తామని తెలిపారు. ఎస్‌సి, బిసి శ్మశానవాటికల్లో బోర్లు,గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు, కల్యాణమండప నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ భోనంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకటరమణకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఎంపిడిఒ రమేష్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కన్నూరు వెంకటరమణ, జనసేన మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, జనసేన ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, మోటూరు సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, బుగుడి రామగోవిందరావు, రెడ్డి శ్రీనివాసరావు, రామచంద్రరావు, కూర్రపు సోమనాయుడు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికి తీయడమే లక్ష్యం



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న లా వర్సిటీ విసి సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రతిభ విద్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి 11వ ప్రతిభ బాస్కెట్‌బాల్ కప్ టోర్నీ పోటీల్లో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

శాప్ డైరెక్టర్ పిబి.విఎస్ఎన్. రాజు మాట్లాడుతూ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 271లో 7 ఎకరాలు స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శాఫ్ ఛైర్మన్‌కు ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ మాట్లాడుతూ తమ పాఠశాలలో 11ఏళ్లుగా బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, ప్రతిభ కప్ అందజేస్తున్నామన్నారు.ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 15జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి పూజారి శైలజ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లాకార్యదర్శి జి. భూషణరావు, ప్రతిభ విద్యాలయ డైరెక్టర్ ఆదిరెడ్డి శరత్‌తేజ పాల్గొన్నారు.

సర్పంచ్‌లను పట్టించుకోరా?

మండల సభలో పలువురి ఆవేదన



అధికారులకు సూచనలు చేస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : సర్పంచులుగా ఉండి ఏం ప్రయోజనమని, తమను ప్రభుత్వం, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు వాపోయారు. శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు మాట్లాడుతూ,అసలు తాము గ్రామాల్లో ఉన్నామో? లేమో పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. గ్రామపంచాయతీల ప్రథమ పౌరుడిగా తమతో పనిలేదా అని ప్రశ్నించారు. తమను ఎందుకు మమ్మల్ని పట్టించుకోవడం లేదని నిలదీశారు. దీంతో కొద్దిసేపు సమావేశంలో గందరగోళం ఏర్పడింది. నిర్వహించారు. దీనిపై వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు స్పందిస్తూ, పార్టీలకతీతంగా ఏ కార్యక్రమం జరిగినా గ్రామ ప్రథమ పౌరుడిగా సర్పంచ్‌కు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వెలుగు అంగన్వాడీ శాఖలపనితీరుపై అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు.

ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణకు జరిమానాలు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణ పరిధిలో ట్రైనీ డిఎస్‌పిఆధ్వర్యంలో ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 35 వాహనాలపై ట్రాఫిక్ చలానాలు విధించారు. హెల్మెట్ లేని 20 వాహనాలకు రూ.1035 చొప్పున, ట్రిపుల్ రైడింగ్ 5 వాహనాలకు రూ.1035 చొప్పున, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లో రెండు వాహనాలకు రూ.2035 చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి, పోలీసులకు సహకరించాలని సూచించారు. కొక్కిరాపల్లి జంక్షన్‌లో ఎఎన్‌పిఆర్ సీసీ కెమెరాలు ఆధారంగా ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనాలపై ఆటోమెటిక్ జరిమానాలకు సంబంధించిన చలానాలు విధిస్తామని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

ప్రజాశక్తి- వడ్డాది.: బుచ్చయ్య పేట మండలం బంగారుమెట్టలో విశ్వబ్రాహ్మణుల కాలనీలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు హామీనిచ్చారు. శుక్రవారం బంగారుమెట్ట విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజును కలిసి వినతిపత్రం అందించారు బంగారుమెట్ట, ఎల్‌బిపి అగ్రహారం గ్రామాల్లో విశ్వ బ్రాహ్మణులు అధికంగా ఉన్నారని, వారి సంక్షేమానికి అన్ని విధాల సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తామరన దాసు కోఆపరేటివ్ అధ్యక్షులు దొండ శ్రీనివాసరావు సాయం శేషు ఎంపిటిసి జగ్గారావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

అనకాపల్లి : పాయకరావుపేట నియోజకవర్గం ఎస్ రాయవరం మండలం పెనుగోలు గ్రామంలో అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి సహకారం అందిస్తానని వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంవిఆర్ ప్రధాన కార్యాలయంలో ఆలయ కమిటీ కమిటీ సభ్యులు ఎంవిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ,పుష్పగుచ్ఛాన్ని అందించి సాలువాతో సత్కరించారు. ఆలయ నిర్మాణానికి సాయంపై ఎంవిఆర్ సానుకూలంగా స్పందించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఐవీ రత్నం (బాబి), రాజు, కె సత్యనారాయణ, అమ్మాజీ, ఎం వి ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కెపి.అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న భూలోకమాంబ ఆలయ నిర్మాణానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎంవివి సత్యనారాయణ, వాణి దంపతులు శుక్రవారం రూ 10,116 విరాళం అందజేశారు. ఆలయనిర్మాణ కమిటీ సభ్యులు అడ్డూరు శ్రీను, ఎంపిటిసి దేవర అప్పారావులకు విరాళం అందజేయగా, వారు కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి :పట్టణంలోని 82 వ వార్డు గాంధీనగర్‌లో సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తితో కలిసి పరిశీలించారు. ఈ ఏర్పాట్లపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కు తగు సూచనలు చేశారు. అనంతరం రావు గోపాలరావు కళాక్షేత్రాన్ని సందర్శించి అక్కడ జరుగు అభివృద్ధి పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉద్యోగ పత్రం అందజేత

ప్రజాశక్తి -అనకాపల్లి :పోలీసు శాఖలో విధులు నిర్వహించి, అకాల మరణం చెందిన సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడంలో అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మునిగిపట్టు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, 2021లో అనారోగ్యంతో కన్నుమూసిన చీమల చెల్లయ్య సేవలను గుర్తించి, వారి కుటుంబానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బాసటగా నిలిచారు మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు చీమల చంద్రశేఖర్‌కు కారుణ్య నియామకం కింద జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను శుక్రవారం ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి చొరవతో తనకు ఉద్యోగం లభించడంపై చంద్రశేఖర్ భావోద్వేగానికి గురయ్యాడు.



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్పి

తమ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఎస్పికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణతో విధులను నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకుంటానన్నారు కార్యక్రమంలో ఎఒ సిహెచ్.తిలక్ బాబు, సీనియర్ అసిస్టెంట్ బీమాబాయి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : స్థానిక యలమంచిలి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం యలమంచిలి యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఎన్నికలకు జిల్లా ప్రధాన కార్యదర్శి సెక్రటరీ డి సీతారామరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల మండల పరిషత్, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు. ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి ప్రకటించారు. యూనియన్ అధ్యక్షునిగా డివి రమణరాజు (పరిపాలనాధికారి, రాంబిల్లి), సెక్రటరీ గా కె శ్రీనివాసరావు (పరిపాలనాధికారి, ఎల్లమంచిలి), వైస్ ప్రెసిడెంట్ గా శ్రీనివాసరావు (పరిపాలనాధికారి, అచ్యుతాపురం), ట్రెజరర్‌గా ప్రకాశరావ్ (సీనియర్ అసిస్టెంట్, యలమంచిలి), జాయింట్ సెక్రటరీగా బిజిలి (సీనియర్ అసిస్టెంట్, రాంబిల్లి), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ధర్మరాజు (జూనియర్ అసిస్టెంట్, జడ్పి ఉన్నత పాఠశాల అచ్యుతాపురం), పివికె శేషుబాబు (పిఐయు సబ్ డివిజన యలమంచిలి) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీతారామరాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ సత్తిబాబు హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు ప్రత్యేక ఆహ్వానితునిగాపిఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి ఆయుర్వేద ఆసుపత్రి (ఆయుష్)కి సొంత భవనం త్వరలో సమకూరనుంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కొంత స్థలాన్ని నూతన భవన నిర్మాణానికి కేటాయించారు. ప్రస్తుతం ఆయుష్ ఆసుపత్రి మండల పరిషత్ కార్యాలయ పూర్వ భవనం (పాత భవనం)లో నడుస్తోంది. ఇక్కడ పనిచేసే ఆయుర్వేద వైద్యాధికారి ఎనిమిదేళ్ల కిందట బదిలీ అయ్యారు. అప్పటి నుంచి 2022 వరకు దిగువ స్థాయి సిబ్బందితో నడిపించారు. ఆ తరువాత ఆ సిబ్బంది బదిలీ కావడంతో ఆసుపత్రి మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయుష్ వైద్యానికి తిరిగి జవసత్వాలు వచ్చాయి. కొత్త వైద్యులతో పాటు సిబ్బందిని నియమించారు. దీంతో ఈ ఆసుపత్రి గత ఏడాది జనవరి 11న పున్హప్రారంభమయ్యింది. ప్రభుత్వ ఆసుపత్రిలో పాడుబడిన భవనంలో దీనిని ప్రారంభించగా, దానిని ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనంలోకి మార్చారు. ఈ ఆసుపత్రికి శాశ్వత భవనం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్ నిధుల నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. నూతన భవన నిర్మాణ స్థలాన్ని ఆయుష్ డిఇఇ పి. మన్మధరావు, ఎఇఇ బి. సంజయ్ నాయుడు, ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ జి.గ్రీష్మ తదితరులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం డిఇఇ మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులకు సంబంధించి మార్కింగ్ ఇచ్చామన్నారు. పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. మార్చిలోగా పూర్తి చెయ్యడానికి కృషి చేస్తామన్నారు. దీంతో పాటు కె.కోటపాడులో రూ.30 లక్షలు, గవరవరంలో రూ. 30 లక్షల వ్యయంతో నూతన భవనాల నిర్మాణ పనులు

జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-సబ్బవరం.: జాతీయ స్థాయి క్రీడల్లో టెన్నికాయిట్ పోటీలో స్థానిక అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. కేరళ లో జరిగిన 37వ సబ్ జూనియర్ బాలుర టెన్నికాయిట్ పోటీలలో గురుకులం ఎనిమిదో తరగతి విద్యార్థి ఒ. రవి కిశోర్‌కి డబుల్స్‌లో మూడోస్థానం, తొమ్మిదోతరగతి విద్యార్థి జె సంపత్ వినయ్ కుమార్‌కు చెందిన టీం జాతీయ స్థాయిలో ఛాంపియన్ షిప్ సాధించారని గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్ కేశవరావు తెలిపారు. క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను స్థానిక తహసిల్దార్ బి. చిన్నికృష్ణ అభినందించారు. కార్యక్రమంలో పిఇటి వర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కె.కోటపాడు : జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన చౌడువాడ జిల్లా పరిషత్ హై స్కూల్‌విద్యార్థులకు స్థానిక సర్పంచి దాడి ఎరుకునాయుడు అన్నారు స్పోర్ట్స్ సామగ్రితో పాటు షూస్, డ్రెస్‌లు పంపిణీ చేశారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు 'ఫైనల్ టచ్ యాక్షన్ ప్లాన్' అనే పుస్తకాలను అందజేశారు.కార్యక్రమంలో పిఎసిఎస్. చైర్మన్ రాజి నారాయణమూర్తి. జనసేన మండల నాయకులు కుంచ అంజిబాబు. టిడిపి నాయకులు మల్లి గోవింద, భీశెట్టి రామకోటి, కుంచా మణికంఠ. స్కూల్ కమిటీ చైర్మన్ మాలి బాబు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ పంపిణీ

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు, అంకంపేట గ్రామ యువతకు శుక్రవారం హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు క్రికెట్ కిట్స్ పంపిణీ చేశారు. యువత క్రీడలలో రాణించి శారీరక, మానసిక వికాసాన్ని పొందాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని సాధించి, భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవవరపు లోవరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ, ఒమ్మివానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ. 12.6 లక్షల తో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత, బిజెపి నాయకులు చొక్కాకుల వెంకటరావు, గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపిటిసి చొక్కాకుల గోవింద శుక్రవారం శంకుస్థాపన చేశారు. జనసేన నాయకుడు పల్లా రమణ ఆధ్వర్యంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు, సబ్బవరపు దేముడు బాబు,ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు, సబ్బవరపు కృష్ణమోహన నాయుడు, సబ్బవరపు మనోహర్ గాంధీ, కిల్లి సూర్యనారాయణ, సబ్బవరపు రమణ, భరణికాన చంటి, ఒమ్మి సూర్యనారాయణ, కోటిబాబు, కోరుకొండ మోహన్ బి. సుధాకర్, పాఠశాల చైర్మన్ గొంప వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



వడ్డాదిలో భూముల రీసర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -వడ్డాది : సమగ్ర రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం.లభిస్తుందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శుక్రవారం బుచ్చయ్యపేట మండలం లోపూడి, వడ్డాది, కోమలపూడి గ్రామాల్లో శుక్రవారం భూసర్వే పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా కోమలపూడిలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భూసర్వేలో చేసిన తప్పిదాలతో రైతులు ఇబ్బందులు పడడమే కాకుండా చాలా నష్టపోయారన్నారు రైతులకు వారసత్వంగా వచ్చినవి, కొనుక్కున్న భూముల హక్కు పత్రాలపై అప్పటి సిఎం జగన్ ఫొటో పెట్టుకోవడం చాలా దారుణమన్నారు. అలాంటి చౌకబారు చర్యలు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ రాజముద్రతో రీసర్వే అనంతరం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను కూటమి ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన దాసు, పిఎసిఎస్ అధ్యక్షులు దొండా శ్రీను, దొండా నరేష్ పంచాయతీ కార్య దర్శి లోవరాజు రామిరెడ్డి, మండల తెలుగు ఉపాధ్యక్షుడు సాయం శేషు, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు పాల్గొన్నారు

సబ్బవరం: మండలంలోని వంగలి, అంతకాపల్లి, బాటజంగాలపాలెం గ్రామాల్లో నాలుగో విడత భూరీ సర్వేను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి సంబంధిత రైతులకు ముందుగా సమాచారం ఇస్తారని, సర్వేకు సహకరించాలని కోరారు. అంతకాపల్లి గ్రామంలో బిజెపి నాయకులు చొక్కాకుల వెంకటరావు, గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి భూ రీసర్వేను ప్రారంభించారు. అంతకాపల్లి ఎంపిటిసి చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపిపిసబ్బవరపు ముత్యాల నాయుడు, సర్పంచ్‌లు ఎ.శ్రీహేమ, ఎస్. నారాయణమూర్తి, పడాల వెంకటరమణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

యస్ రాయవరం.: మండలంలో జీవి పాలెం, వాకపాడు, ఉప్పరపల్లి,చిన్న ఉప్పలం, పెదగుమ్ములూరు, గ్రామాల్లో రీసర్వే ప్రారంభమె పెద్దగుమ్ములు గ్రామంలో మాజీ ఎంపిపి, ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు వినోద్ రాజు, జెవి పాలెంలో గ్రామ సర్పంచ్ వజ్రపు శంకరరావు రీసర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు మూర్తి, విఆర్ఒనూకరాజు, విలేజ్ సర్వేయరు శ్రీను, స్థానిక నాయకులు, పాకలపాటి రమేష్, కంది కొండ అప్పన్న పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -అనకాపల్లి :నూతన సంవత్సరంలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో తన తండ్రి ఆళ్ల వెంకట్రావు జ్ఞాపకార్థం 30 మంది రిక్షా కార్మికులకు శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. సూదికొండ మాణిక్యం పర్యవేక్షణలో పెంటకోట సురేష్, నటభూషణ్ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు సహకారంతో వీటిని రిక్షా కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో రిక్షా యూనియన్ ప్రెసిడెంట్ వెంకట్రావు, సెక్రటరీ నీలకంఠం, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డి పట్టా భూములకు..

గ్రామసభలో పాస్ పుస్తకాలు ఇవ్వాలి


- సిపిఎం ఆధ్వర్యంలో రైతుల ఆందోళన



నినాదాలు చేస్తున్న సిపిఎం నేత గోవిందరావు, గిరిజనులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కొమిర, కవగుంట గిరిజన రైతుల డి పట్టాల భూములకు గ్రామ సభలో పట్టా పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజన రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరావు, గిరిజనులు మాట్లాడుతూ, కవగుంట, కొమీర గ్రామాల గిరిజన రైతులకు గతంలో డి పట్టా భూములకు పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జగనన్న రీ సర్వేలో స్థానికుల డి పట్టా భూములను ప్రభుత్వ భూములుగా చూపుతూ, స్థానికేతరులకు పట్టాలు మంజూరు చేశారన్నారు. తక్షణమే స్థానికేతరుల పట్టాలను రద్దు చేసి స్థానికులకు పట్టాలను తక్షణమే పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జగనన్న రీ సర్వేలో డి పట్టా భూములను రికార్డుల నుంచి తొలగించి, గిరిజనేతర్లకు పాసుపుస్తకాలు మంజూరు చేయడం విచిత్రంగా ఉందన్నారు. స్థానికేతలకు ఇచ్చినటువంటి కొత్త పట్టాలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన పేద ప్రజలు గత 60 సంవత్సరాల నుండి జీడి మామిడి తోటలు, వరి, పంటలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరికి 1979 సంవత్సరం నుండి 2014 వరకు వీరికి పట్టాలు మంజూరు చేశారన్నారు. పట్టాలు కలిగి, సాగులో ఉన్న వారి పట్టాలు రద్దు పరచడం తగదన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కుల భూ రక్షణ పథకం పేరుతో సర్వేలో ఫీల్డ్ సర్వే జరిగినప్పుడు రైతులు ఎవరి భూమిని వారు చూపించారన్నారు. రీ సర్వే అనంతరం సర్వే వివరాలు గ్రామ సభలో వెల్లడించకుండా రికార్డులు తయారు చేశారన్నారు. గయ్యాలిగా నమోదు చేసి ఉండడంతో రైతులు ఒక్కసారిగా ఆవాకయ్యారన్నారు.. గతంలో తమ పేరున ఇచ్చిన ప్రభుత్వ భూమిని వేరే వారి పేరున ఏ విధంగ కొత్త పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు సాగు అనుభవంలో ఉన్న తమకు ఏ విధమైన నోటీసులు ఇవ్వలేదని, విచారణ చేపట్ట లేదన్నారు. వేరొకరి పేరున ఇచ్చిన పట్టాలు రద్దుచేసి గతంలో పట్టాదారు ఎవరైతే ఉన్నారో వారి పేరున పాసుపుస్తకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 3న కొమీర, కవగుంట గ్రామాల్లో జరిగే గ్రామసభలో తమకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మహిళలు రోబ్బ వరాలమ్మ, బీరా దేవుడమ్మ, సమల శంకర్రావు, సిద్ధ లక్ష్మి, నాగరాజు, రవణమ్మ, సీకురు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



నర్సీపట్నంలో పాస్‌పుస్తకం ఇస్తున్న స్పీకర్ అయ్యన్న



అనకాపల్లిలో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- యంత్రాంగం

రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను శుక్రవారం పలుచోట్ల పంపిణీచేశారు.

నర్సీపట్నంరూరల్: రైతుల భూములకు 'రాజముద్ర'తోనే ఇకపై పాస్ పుస్తకాలు జారీ చేస్తామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. నర్సీపట్నం స్థానిక మార్కెట్ యార్డులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. కొత్తగా ఇస్తున్న పాస్ పుస్తకాలకు అధునాతన టెక్నాలజీని ఉపయోగించామని స్పీకర్ తెలిపారు. ప్రతి పాస్ పుస్తకంపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, స్మార్ట్ ఫోన్ ద్వారా ఈ కోడ్ స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సూర్యచంద్ర, జడ్పిటిసి రమణమ్మ, ఆర్డీవో వివి. రమణ పాల్గొన్నారు.

రావికమతం: ప్రభుత్వ రాజ ముద్రతో కూడిన భూమి పాసుపుస్తకాలను చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు నూతన పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో సచివాలయ వద్ద శుక్రవారం రావికమతం రెవిన్యూ పరిధిలో 536 మంది రైతులకు, నియోజకవర్గంలో 25వేల మంది రైతులకు నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో గుమ్మాల పాడు, చినపాచిల, గ్రామాల్లో పాస్ పుస్తకాలను పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు అంబేద్కర్, స్థానిక సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరరావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజన కొండ నాయుడు, గొంప ఎంపీటీసీ సూర్యనారాయణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు పలువురు పాల్గొన్నారు.

మాడుగుల: రాష్ట్రంలో రైతుల హక్కులను కాలరాసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే ఒక్క వైకాపా నని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. మండలంలోని పొంగలిపాక గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీని సర్పంచి నాయన దేముడమ్మ, సత్యనారాయణ, కింతలి పీఏసీసీఎస్ చైర్పర్సన్ ఉండూరు దేముడు, అధ్వర్యంలో చేపట్టారు. తహసీల్దారు కె.రమాదేవి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసిం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, కార్యదర్శి రమేష్, పెద్దేరు జలాశయం చైర్మన్ జగ్గారావు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా రైతులకు వారి భూమి భరోసాతోకూడిన శాశ్వత హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శుక్రవారం అనకాపల్లి మండలం గోపాలపురం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్రఅర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్‌డిఒ అయేషా పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని చూచుకొండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి సత్యనారాయణ, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఎల్లపు భాస్కరరావు, కే చంద్రమోహన్, కాండ్రేగుల నాయుడు, సర్పంచ్ దొడ్డి సూరి అప్పారావు, ఎంపిటిసి కాండ్రేగుల కిరణ్ పాల్గొన్నారు.

సబ్బవరం : రీసర్వేపూర్తయిన మండలంలోని గొల్లపాలెం పంచాయితీ విప్పాక అగ్రహారం రెవెన్యూ పరిధిలో రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు గొల్లవిల్లి రమణ, మరియు వంగలపూడి సంతోష్, దాసరి కనకరాజు, బొండా అప్పలరాజు, మోపాడ దేవానంద, దాసరి మహాలక్ష్మి నాయుడు , మరియు వి ఆర్వో దేముడుబాబు , గ్రామ సర్వేయర్ దినేష్ పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : మండలంలోని పులపర్తి గ్రామంలో రైతులకు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు రావు, ఎంపిడిఓ కొండలరావు, యలమంచిలి ఎంపిపి రాజన శేషగిరిరావు, కాలువ చైర్మన్ సుంకర బుల్లిబాబు, వూటకూటి రమేష్, కొలగాని భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

దేవరాపల్లి : కాశీపురం, కాశీపతిరాజుపురం, నాగయ్యపేట, సీతంపేట గ్రామాల్లో శుక్రవారం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. కాశీపురంలో తహశీల్దార్ పి. లక్ష్మీదేవి అధ్యక్షతనసర్పంచి ఆదిరెడ్డి వరలక్ష్మి పాస్ పుస్తకాలను అందజేశారు. నాగయ్యపేటలో సర్పంచ్ కర్రి పుష్పదేముళ్ళు రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.

బుచ్చయ్యపేట:మండలంలోని అయితంపూడిగ్రామంలో రైతలుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు పంపిణీ చేశారు. తిప్పిడి గ్రామం తహశీలా ఎం లక్ష్మి గ్రామసభ నిర్వహించి రైతులకు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర లక్ష్మి, ఎంపిపి దాకారపు నాగేశ్వరి దేవి దేవి, పడాల గోవింద విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచులు పెద్దాడ నాయుడు, పెడిరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు, సన్నపటి శ్రీను, ముమ్మిన నాగరాజు, ఆర్వివి శ్రవణ్, ఆర్ఐ సత్తిబాబు సాయి పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో రైతులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 13 వేలకు పైగా పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. పాత భూ హక్కు పత్రాల స్థానంలో ఎలాంటి తప్పులు లేని కొత్త పాస్ పుస్తకాలను రాజముద్రతో ఇస్తున్నామని చెప్పారు. రీ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది డిసెంబరులోపు అందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని కోలవానిపాలెం, జిఎస్ అగ్రహారం రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో అందిస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పంపిణీ చేశారు.

పద్మనాభం : మండలంలోని అయినాడ గ్రామంలో 375 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను గ్రామ రెవెన్యూ సదస్సులో పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి.జగన్నాథం, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, నాయకులు కె.నగేష్‌కుమార్, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మత్స్యకార ప్రజాప్రతినిధులు

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో హెటిరో కంపెనీ యాజమాన్యం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయనున్న భవన నిర్మాణానికి శుక్రవారం గ్రామ పెద్దలు భూమి పూజ చేసారు. మత్స్యకారుల వేట సామాగ్రి భద్రపరుచుకునేందుకుగాను భవన నిర్మాణం చేపట్టాలని కంపెనీ యాజమాన్యాన్ని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం స్పందించి భవనం మంజూరు చేశారు. రాజయ్యపేట సముద్ర తీరం వద్ద భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి కంపెనీ యాజమాన్యం 30 లక్షలు మంజూరు చేసినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిక్కి అప్పలనరస, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, కంపెనీ సిఎస్ ఆర్ ప్రతినిధి శ్రీనివాస్, మత్స్యకార నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



దాణా పంపిణీ చేస్తున్న సర్పంచ్

రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి -చీడికాడ: ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పశువుల దాణాను రైతులకు 50శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి అన్నారు. చీడికాడ మండలం జైతవరం గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ పైల ముత్యాల నాయుడు చేతుల మీదుగా రైతులకు టిఎంటి పశువుల దాణా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, టిఎంటి పశువుల దాణాతో పశువులలో పాల దిగుబడి ఉత్పత్తి బాగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బైలపూడి ఎంపీటీసీ ప్రసాద్, టిడిపి నాయకులకు సరగడం శివ, జాజిమొగ్గల గణేష్, పశు సంవర్ధక సిబ్బంది మార్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్క కాటుతో పలువురికి గాయాలు



గాయపడిన విద్యార్థి

ప్రజాశక్తి-రావికమతం: కొత్తకోట, మరివలస, టి. అర్జాపురం గ్రామాలలో శుక్రవారం కుక్కకాటుతో పలువురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. వీరంతా కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం చికిత్స పొందారు. మర్రివలసలో ఐదుగురు, కొత్తకోటలో నలుగురు, టీ.అర్జాపురంలో ఇద్దరిని కుక్క కాటు వేయడంతో ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని కొత్తకోట పీహెచ్సీ విస్తరణ అధికారి రామారావు తెలిపారు.

శ్మశాన వాటికలో మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కొత్తకోట గ్రామంలో శ్మశాన వాటికకు సంబంధించిన స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలు భారీగా ఉన్నాయి. దీంతో గుమ్మడి దొరబాబు తో పాటు పలువురు స్థానికులు కలసికట్టుగా తొలగించాలని నిర్ణయించారు. కాపు, నాయి బ్రాహ్మణులు, బ్రాహ్మణులు, దేవాంగులు, విశ్వబ్రాహ్మణులు అందరూ కలిసికట్టుగా శ్మశాన వాటికను శుభ్రపరుచుకొని దానిని ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. దీంతో జెసిబి సహాయంతో శుక్రవారం సుమారు ఎకరా భూమిలో ఉన్న జంగిల్ తుప్పలను తొలగించి, శ్మశాన వాటికను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిసిసి ఎమ్‌డి కల్పనా కుమారి

వాస్తవాల ప్రతిబింబం.. ప్రజాశక్తి

ప్రజాశక్తి - విశాఖపట్నం :ప్రజాశక్తి కేలండర్‌ను జిసిసి ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగతా పత్రికలకూ, ప్రజాశక్తికీ ఎంతో తేడా ఉందన్నారు. ప్రజల జీవితాలను ప్రతిబింబిస్తూ, వాస్తవాలను ప్రచురిస్తూ ప్రజాశక్తి మెప్పు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, రాజేశ్వర్‌రెడ్డి, దేవుడుబాబు పాల్గొన్నారు.

రావికమతం:నిజాలు నిక్కచ్చిగా ప్రచురించే పత్రిక ప్రజాశక్తి అని ఎంపీడీవో మహేష్ అన్నారు. మండల కేంద్రంలో ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను శుక్రవారం ఎంపీడీవో మహేష్, స్థానిక సర్పంచ్ గెంజి మోది నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్టుగా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. నిత్యం పేదల ప్రక్షాన పోరాడే పత్రిక్త అని అన్నారు. అటువంటి పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి రామ నాయుడు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, సర్పంచ్

గజ వాహనంపై తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాసుడుని గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదా చార్యులు, పీసపాటి శేషా చార్యులు, గోపాలా చార్యులు పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగిస్తున్న అర్చకులు

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్::నర్సీపట్నం జనసేన పార్టీ ఆఫీసులో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు పోస్టర్‌ను జనసేన పార్టీ సీనియర్ నాయకులు అప్పన ఎన్ఎస్.జి దొరబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కబబడ్డీ పోటీల్లో విజేతకు లక్ష రూపాయలు ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. జిల్లాలో ఉన్న క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ ప్రెసిడెంట్ అద్దేపల్లి గణేష్, కిరణ్, గొంప కృష్ణ, సతీష్, చొప్ప నానాజీ, త్రినాథ్ మారిసెట్టి రాజా పాల్గొన్నారు.ఈ కబడ్డీ పోటీలు ఈనెల 9,10,11 తేదీల్లో జరుగుతాయని, మరిన్ని వివరాలకు ఫోన్: నెంబర్లు అప్పారావు, 9849572230 అద్దేపల్లి గణేష్ 9849533983లో సంప్రదించాలని సూచించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దొరబాబు

4న మహాసభను జయప్రదం చేయండి

- సిఐటియు ఆధ్వర్యాన విస్తృత ప్రచారాలు

ఈ నెల 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. యలమంచిలి, అనకాపల్లి, అచ్యుతాపురం, గాజువాక, తగరపువలసల్లో ఈ ప్రచార హోరు సాగింది.

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ (అచ్యుతాపురం): సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా ఈనెల 4న విశాఖలో నిర్వహించే కార్మిక ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లోని బ్రాండిక్స్ పరిశ్రమలో కార్మికులకు కరపత్రాలను పంచుతూ సిఐటియు నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేస్తారన్నారు.లేబర్ కోడ్స్ రద్దు కొరకు కార్మికులంతా ఏకమై పోరాడాలని కోరారు. కార్మిక ప్రదర్శన, బహిరంగసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందవరపు నారాయణరావు, కె రమణ, శనివాడ పొట్టినాయుడు, టక్కల సూరిబాబు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : ఈనెల 4న విశాఖలో సిఐటియు ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము పిలుపునిచ్చారు. శుక్రవారం యలమంచిలి మండలం మర్రిబంద గ్రామంలో ఫ్యూషన్ బ్లాక్స్ పరిశ్రమలోని ముఠా కార్మికులతో సమావేశమయ్యారు. సిఐటియు అఖిలభారత మహాసభ ముగింపు బహిరంగసభలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రుత్తల సత్యనారాయణ, చుక్క లావరాజు, కాళ్ళ నాయుడు, శంకర్ రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : ఈనెల 4న విశాఖపట్నంలో లక్షలాది మందితో జరుగు కార్మిక ప్రదర్శన, మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు అంగన్వాడీల యూనియన్ నేత ఎం.నాగశేషు, విఒఎల యూనియన్ నేత సిహెచ్ రూపాదేవి పిలుపునిచ్చారు. సిఐటియు అఖిలభారత 18వ మహాసభలో అనకాపల్లి జిల్లా నుంచి ప్రతినిధులుగా హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మహాసభ అత్యంత ఉత్సాహ భరితంగా సాగుతోందని,దేశం నలు మూలలు నుంచి వచ్చిన ప్రతినిధులతో అనేక అంశాలపై చర్చల్లో పాల్గొనడం, భవిష్యత్తు కార్యచరణపై మేధో మధనంలో పాలొ ్గనడం ఆనం దంగా ఉందన్నారు.

అనకాపల్లి : సిఐటియు అఖిలభారత మహాసభ ముగింపుగా ఈనెల 4న విశాఖలో కార్మికర్యాలీ, బహిరంగసభను విజయవంతం చేయాలను కోరుతూ శుక్రవారం అనకాపల్లిలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. అనకాపల్లిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొణతాల నందీశ్వరరావు అధ్యక్షతన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ పిలుపునిచ్చారు. కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు మహాసభల్లో అన్నివర్గాల కార్మిక సమస్యలపై కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మిక సమస్యలు చర్చించడం జరుగుతుందన్నారు. గవరపాలెం మస్తర్ పాయింట్ వద్ద మున్సిపల్ కార్మికులతోను, రావు గోపాలరావు కళాక్షేత్రం ముఠా కార్మికులతో సమావేశాలు నిర్వహించి మహాసభకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివిఎన్ పరమేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ కాళ్ళ తేలయ్యబాబు, కొణతాల నందీశ్వరరావు, వారాధి సత్యనారాయణ, బోడి రాజు, కనకాల అప్పలరాజు, కె కళ్యాణం, టి సురేష్, భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు పాల్గొన్నారు.



అనకాపల్లిలో ప్రచారం చేస్తున్న సిఐటియు నేతలు



అచ్యుతాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు



మర్రిబందలో ప్రచారం చేస్తున్న నేతలు

గాజువాక : సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో ఈ నెల 4న జరగనున్న బహిరంగ సభ, ర్యాలీని జయప్రదం చేయాలని రైల్వే వేగన్ వర్క్ షాప్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు వడ్లపూడి రైల్వే వేగన్ వర్క్‌షాపు వద్ద శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు రైల్వే వేగన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గాజువాక జోన్ కార్యదర్శి ఎల్.బంగారునాయుడు, కె.అవతారం, యువి.రాజు, వి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సతీష్, సురేష్ పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు అఖిల భారత మహాసభల బహిరంగ సభకు కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొవాలని భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆటో ప్రచార జాతా ప్రారంభమైంది. ఈ జాతానుద్దేశించి సిఐటియు జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, సిఐటియు అఖిలభారత మహాసభల ముగింపు సందర్భంగా విశాఖపట్నంలో జరిగే బహిరంగను, దానికి ముందు నిర్వహించే ర్యాలీని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి అప్పలనాయుడు, బాబాజీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



రైల్వే వేగన్ వర్క్‌షాపు వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రాంబాబు



తగరపువలసలో జాతానుద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఎస్ఎన్.మూర్తి

భూముల రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక గ్రామం లో శుక్రవారం తహసిల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో భూముల రీ సర్వేపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నరసింహామూర్తి మాట్లాడుతూ, గ్రామంలో భూముల రీ సర్వే చేపడుతున్నామని, రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులందరూ దగ్గరుండి భూములను రీ సర్వే చేయించుకోవాలన్నారు. రీ సర్వేతో రైతుల పంట భూములకు సరిహద్దులను ఏర్పాటు చేయడంతో అపరిష్కృతంగా వున్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం భూములు రీ సర్వే పై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, వైసిపి నాయకులు కొల్లాటి బుజ్జి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు జగదీశ్వరరావు, టిడిపి నాయకులు వాసు, తోలేటి శ్రీనివాస్, పలువురు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు
ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ జీవన ప్రమాణ పత్రాలను జనవరి ఒకటవ తేదీ నుండి ఫిబ్రవరి 28 వరకు తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఖజానా, గణాంక అధికారి వి.ఎల్. శుభాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవన్ ప్రమాణ యాప్ ద్వారా మొబైల్ ఫోన్‌లలో గానీ, పోస్టాఫీసులు, బ్యాంకులు, ఉపఖజానా కార్యాలయాలు లేదా జిల్లా ఖజానా కార్యాలయాల ద్వారా గానీ తమ జీవన ప్రమాణ పత్రాలను సకాలంలో సమర్పించాలని సూచించారు. తద్వారా పెన్షన్ నిలిచిపోకుండా చూడాలన్నారు. అనారోగ్య కారణాల వల్ల కార్యాలయాలకు రాలేని పెన్షనర్లు సంబంధిత ఖజానా అధికారులకు సమాచారం అందిస్తే, అధికారులే స్వయంగా వచ్చి జీవన ప్రమాణ పత్రాలను నమోదు చేస్తారన్నారు. .బయోమెట్రిక్ సమస్యలు ఎదుర్కొంటున్న పెన్షనర్లు నేరుగా సంబంధిత ఖజానా కార్యాలయాన్ని సంప్రదించి జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించవచ్చని వివరించారు.